'మధ్యాహ్న' భోజనాన్ని పరిశీలించిన కేంద్ర బృందం



ఘట్‌కేసర్‌లో జడ్పీ బాలికల పాఠశాలలో మధ్యాహ్న భోజన సరుకులను పరిశీలిస్తున్న అధికారులు

7

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

మేడ్చల్

గురువారం 24 ఆగస్టు 2017 20



- ఇక నుంచి అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ పేరెంట్ - టీచర్ మీటింగ్
- ప్రతి నెలా 9న సమావేశం
- నెలవారీగా ప్రోగ్రెస్ కార్డులు
- విద్యార్థుల ప్రతిభ ఆధారంగా మార్కులు
- ప్రైవేట్ పాఠశాలల మాదిరిగానే నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ ఏర్పాటు దిశగా అడుగులు
- ఇంగ్లీష్ మీడియంలో ప్రీప్రైమరీ విద్యకు శ్రీకారం

అంగన్‌వాడీలకు కార్పొరేట్

హంగు



అంగన్‌వాడీ కేంద్రాలకు మహర్దశ పట్టనుంది. కార్పొరేట్ హంగులు చేకూరనున్నాయి. ప్రైవేట్‌కు దీటుగా మెరుగైన విద్యనందించనున్నారు. ఇందుకోసం విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. ఇక నుంచి అంగన్‌వాడీ కేంద్రాల్లో పేరెంట్-టీచర్ మీటింగ్ నిర్వహిస్తారు. ప్రతి నెలా 9న తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి ప్రోగ్రెస్ కార్డులు ఇస్తారు. విద్యార్థుల ప్రతిభ ఆధారంగా మార్కులు కేటాయిస్తారు. ప్రైవేట్ పాఠశాలల మాదిరిగానే నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ ప్రవేశపెట్టేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నారు. ఆంగ్ల మాధ్యమంలో ప్రీప్రైమరీ విద్యకు శ్రీకారం చుట్టనున్నారు.





వార్త 7లో...



మాట్లాడుతున్న కలెక్టర్, హాజరైన అధికారులు

ఓటరు జాబితా సవరణను

వేగవంతం చేయాలి

కలెక్టర్ ఎంవీ రెడ్డి 7

హోటళ్లలో కల్తీపై నజర్

- సరుకుల కల్తీని అరికట్టేందుకు చర్యలు
- ఫిర్యాదులపై స్పందించిన ఆహార భద్రత అధికారులు
- ఇప్పటి వరకు 31కేసులు
- రూ.1.34 లక్షల వరకు జరిమానా
- ఫుడ్‌సేఫ్టీ శాఖ అధికారి అశోక్ 2



నిమజ్జనోత్సవానికి ఏర్పాట్లు

వినాయక నిమజ్జనానికి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని, భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ సందీప్ శాండిల్యా అధికారులను ఆదేశించారు. ఏదులాబాద్, రాంపల్లిలోని చెరువులను బుధవారం పరిశీలించారు. 7



జిల్లా ట్రెజరీలో ఏసీబీ సోదాలు



జిల్లా ట్రెజరీ కార్యాలయంలో బుధవారం ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఆదిలాబాద్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న ఆడెపు బాబు వద్ద ఆదాయానికి మించిన ఆస్తులున్నాయనే ఆరోపణలపై ఏసీబీ అధికారులు బుధవారం సోదాలు నిర్వహించారు. అందులో భాగంగా ట్రెజరీ కార్యాలయంలో బాబు భార్య విజయలక్ష్మి ఎస్టీవోగా విధులు నిర్వహిస్తుండటంతో ఆయనకు సంబంధించిన సమాచారం కోసం తనిఖీలు చేపట్టారు. - వివరాలు మెయిన్‌లో

పోస్టుల భర్తీపై కసరత్తు

- జిల్లాకు కొత్తగా 17 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మంజూరు
- కాంట్రాక్టు పద్ధతిన వైద్యులు, సిబ్బంది నియామకాలు
- 255 మంది పోస్టులకు దాదాపు 2వేల మంది దరఖాస్తులు
- మెరిట్ జాబితాపై వైద్యశాఖ కసరత్తు 7
- రెండు వారాల్లోగా నియామక ప్రక్రియ పూర్తి చేసేందుకు చర్యలు



ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకుంటున్న అభ్యర్థులు(ఫైల్)

ఆర్డీవోకు సన్మానం

తూంకుంట గ్రామ పంచాయతీ కార్యాలయానికి బుధవారం స్పెషలాఫీసర్‌గా ఆర్డీవో హనుమంతరెడ్డి విచ్చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ చంద్రశేఖర్, సర్పంచ్ ఎద్దు నాగేశ్, వార్డు సభ్యులు ఆర్డీవో హనుమంతరెడ్డిని ఘనస్వాగతం పలుకుతూ శాలువకప్పి సన్మానించారు. - శామీర్‌పేట



నత్తనడకన రోడ్డు విస్తరణ పనులు

ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు

పట్టించుకోని అధికారులు



కంకరవేసి నిలిపివేసిన రోడ్డు పనులు



కట్ట వెడల్పు కోసం తవ్వి వదిలివేసిన దృశ్యం

మేడ్చల్ : మండలంలో అంతర్గత రోడ్ల అభివృద్ధి పనులు నత్తనడక సాగుతున్నాయి. దీంతో పలువురు వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా మేడ్చల్ ఆర్టీసీ డిపో నుంచి కిష్టాపూర్ రోడ్డు వయా పూడూరు మీదుగా నల్సార్ వరకు గల ఆర్ అండ్ బీ రోడ్డు విస్తరణ పనులు నత్తనడుకన జరుగుతున్నాయి. డిపో నుంచి నల్సార్ వరకు దాదాపు 7 కిలోమీటర్ల మేర గల ఆర్ అండ్ బీ రోడ్డు పనులను ఆరు నెలల క్రితం ప్రారంభించారు. రోడ్డును విస్తరించడంతో పాటు నూతనంగా రోడ్డును వేస్తున్నారు. ఇందుకోసం రూ. 3 కోట్ల వరకు ఖర్చు చేస్తున్నారు. నిత్యం బిజీగా ఉండే ఈ రోడ్డును విస్తరించడంతో ఆయా గ్రామాల ప్రజలకు సౌకర్యంగా మారుతుందని భావించారు. మేడ్చల్ డిపో నుంచి కిష్టాపూర్, పూడూరు, నల్సార్ మీదుగా శామీర్‌పేట రాజీవ్ రహదారి వరకు చేరుకోవచ్చు. ఆయా గ్రామాల ప్రజలతో పాటు శామీర్‌పేటకు వెళ్లే వారు కూడా ఎక్కువగా ఈ రోడ్డును ఉపయోగిస్తుంటారు. దీంతో పాటు ఈ రోడ్డులో గోదాములు, పరిశ్రమలు, ఫౌల్ట్రీఫాంలు ఉండటంతో నిత్యం వాహనాలతో బిజీగా ఉంటుంది. కొన్ని సంవత్సరాలుగా ఇరుకుగా ఉన్న ఈ రోడ్డుతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు. ఈ క్రమంలో ప్రభుత్వం రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించడంతో పాటు 3 కిలోమీటర్ల మేర రోడ్డు పనులు కూడా పూర్తయ్యాయి. మిగిలిన నాలుగు కిలోమీటర్ల మేర రోడ్డు పనులు నిలిచిపోయాయి. దీంతో ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. విస్తరణలో భాగంగా రోడ్డుకిరువైపులా తవ్వి కంకరవేసి వదిలేశారు. దీంతో ఉన్న రోడ్డు ఇరుకుగా మారి రాకపోకలు సాగించే వారు ప్రమాదాలకు గురవుతున్నారు. ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు మరో వాహనం రోడ్డు దిగలేని పరిస్థితి నెలకొంది. వర్షాకాలం కావడంతో వాహనదారులు ఇబ్బందులకు గురౌతున్నారు. ముఖ్యంగా పూడూరు కట్టను వెడల్పు చేసేందుకు కట్టను తవ్వి అలాగే వదిలివేశారు. దీంతో కట్టపై ప్రయాణించేవారు తీవ్ర భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు పనులను త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న విష్ణువర్ధన్‌రెడ్డి

వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తీసుకోవాలి

తహసీల్దార్ విష్ణువర్ధన్‌రెడ్డి

మేడ్చల్ : అనుమతి లేకుండా గణేషుడి విగ్రహాలు నెలకొల్పితే నిమజ్జనానికి అనుమతించేదిలేదని తహసీల్దార్ విష్ణువర్ధన్‌రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం సాయంత్రం మేడ్చల్ మండల పరిషత్ కార్యాలయంలో నగర పంచాయతీ పరిధిలోని అఖిలపక్ష నాయకులతో వినాయక నవరాత్రి ఉత్సవాలపై సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో తహసీల్దార్ మాట్లాడుతూ వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తీసుకోవాలన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలిగే విధంగా రోడ్లపై మండపాలు ఏర్పాటు చేయవద్దని సూచించారు. పోలీసులు, విద్యుత్ అధికారుల అనుమతి ఉంటేనే నిమజ్జనానికి అనుమతిస్తామని చెప్పారు. మేడ్చల్ పెద్ద చెరువులోనే ఈ ఏడాది నిమజ్జనం కోసం ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఆయా పార్టీలకు చెందిన నాయకులు వినాయక ఉత్సవాలు నిర్వహించే నిర్వాహకులకు తగిన సలహాలు, సూచనలు చేయాలన్నారు. శాంతియుత వాతావరణంలో వినాయక ఉత్సవాలను జరుపుకునేందుకు అందరూ సహకరించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. సమావేశంలో మేడ్చల్ నగర పంచాయతీ కమిషనర్ రాంరెడ్డి, సీఐ వెంకట్‌రెడ్డి, టీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు భాస్కర్‌యాదవ్, మల్లికార్జునస్వామి, ట్రాఫిక్ ఎస్‌ఐ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడిగా శ్రీనివాస్‌రెడ్డి



శ్రీనివాస్‌రెడ్డికి నియామకపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

మేడ్చల్ రూరల్: కిసాన్ మోర్చా మేడ్చల్ మండల అధ్యక్షుడిగా గిర్మాపూర్ గ్రామానికి చెందిన బొక్క శ్రీనివాస్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఈ మేరకు బుధవారం మేడ్చల్ పట్టణంలోని శ్రీనివాస కళ్యాణ మండపంలో జరిగిన సమావేశంలో కిసాన్ మోర్చా మండల కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా చంద్రయ్య, కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా కుమ్మరి జాంగీర్, కార్యదర్శులుగా రమేశ్‌రెడ్డి, సాయినాగరాజులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు నరేందర్‌చారి, కిసాన్‌మోర్చా జిల్లా కార్యదర్శి బి.బల్లారెడ్డి, మాజీ సర్పంచ్ గణేష్, కె.మహేశ్, ఎన్.నాగేష్, బీజేపీ మండల అధ్యక్షుడు గౌరారం జగన్‌గౌడ్ పాల్గొన్నారు.



అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు భూమి పూజ చేస్తున్న సర్పంచ్ సునీతానవీన్, ఈవోపీఆర్డీ మల్లికార్జున్, వార్డు సభ్యులు

గ్రామాభివృద్ధికి కృషి : సర్పంచ్

శామీర్‌పేట రూరల్ : గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని అనంతారం గ్రామ సర్పంచ్ సునీతనవీన్ అన్నారు. బుధవారం శామీర్‌పేట మండలం అనంతారం గ్రామంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు ఆమె భూమి పూజ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామంలోని సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామన్నారు. ప్రధానంగా డ్రైనేజీ, వీధి దీపాలు, తాగునీటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆమె తెలిపారు. శామీర్‌పేట ఈవోపీఆర్డీ మల్లికార్జున్ మాట్లాడుతూ గ్రామంలో ఏమైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఐలయ్య, వార్డు సభ్యులు లక్ష్మీగురువయ్య, లక్ష్మీముత్యాలు, శంబారెడ్డి, వీవోఏ బాలమణి తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయకుడిని పూజించాలి

నగర పంచాయతీ కమిషనర్ రాంరెడ్డి



మట్టి విగ్రహాలను అందజేస్తున్న కమిషనర్ రాంరెడ్డి

మేడ్చల్ రూరల్ : కాలుష్యాన్ని నివారించేందుకు మట్టి వినాయకుడిని పూజించాలని మేడ్చల్ నగర పంచాయతీ కమిషనర్ రాంరెడ్డి కోరారు. బుధవారం ఆయన నగర పంచాయతీలోని పలువురు మహిళలకు మట్టి వినాయకుడిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్టి విగ్రహాలతో ఎటువంటి కాలుష్యం ఉండదన్నారు. రసాయనాలతో తయారుచేసిన విగ్రహాలతో పలు ఇబ్బందులు ఉంటాయని చెప్పారు. నగర పంచాయతీ పరిధిలో మట్టి వినాయకుడిని ఇంటింటికీ పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

చిన్నారులకు బ్యాగుల పంపిణీ



చిన్నారులకు బ్యాగులు అందజేస్తున్న నెటిజన్ ఫోరం సభ్యులు

మేడ్చల్ రూరల్ : తెలంగాణ నెటిజన్స్ ఫోరం ఆధ్వర్యంలో బుధవారం మేడ్చల్‌లోని భవిత ప్రత్యేకావసరాలుగల పిల్లల వనరుల కేంద్రంలోని చిన్నారులకు స్కూలు బ్యాగులు, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రిసోర్స్‌పర్సన్ థెరిస్సా మాట్లాడుతూ చిన్నారులకు సహాయం చేయడానికి ముందుకువచ్చిన నెటిజన్స్ ఫోరం సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. నెటిజన్స్ ఫోరం సంస్థ సభ్యులు మాట్లాడుతూ భవిష్యత్తులో ఎలాంటి అవసరం వచ్చినా ముందుంటామన్నారు. కార్యక్రమంలో తెలంగాణ నెటిజన్స్ ఫోరం సంస్థ వైస్ ప్రెసిడెంట్ అరుణ్‌కుమార్, సభ్యులు రజిత, అఖిలేష్, అత్వెల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి రైతు బజార్ ధరలు

కేపీహెచ్‌బీకాలనీ : కూకట్‌పల్లి రైతు బజార్ ధరలు కేజీలు.. రూపాయల్లో.. టమోట 43, వంకాయ 25, బెండ 25, పచ్చిమిర్చి 23, బజ్జిమిర్చి 31, కాకర 18, బీర 18, క్యాబేజీ 16, బీన్స్ 38, క్యారెట్ 38, క్యాలీఫ్లవర్ 13, దొండ 26, చిక్కుడు 48, గోకరకాయ 21, బీట్‌రూట్ 21, క్యాప్సికమ్ 28, ఆలుగడ్డ 14, కీర 13, దోస 15, సొర 13, పొట్ల 18, కంద 19, ఉల్లిపొర 33, ఉల్లిగడ్డ 25, మామిడి 08-10, అరటి 08-09, చామగడ్డ 25, ముల్లంగి 03-04, మొరంగడ్డ 30, పేర్కొన్న ధరలు ఈ రోజు ఉదయం 9.30 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.



రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ రాములు జన్మదినం సందర్భంగా బుధవారం లంబాడ సంక్షేమ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దన్‌రాజ్ నాయక్ మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకేతో అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. - మేడ్చల్ రూరల్

ఆంధ్రజ్యోతి / ఇంటర్వ్యూ

హోటళ్లలో కల్తీపై నజర్

- సరుకుల కల్తీని అరికట్టేందుకు చర్యలు
- ఫిర్యాదులపై వెంటనే స్పందించిన అధికారులు
- ఇప్పటి వరకు 31కేసులు నమోదు
- రూ.1.34లక్షల వరకు జరిమానా
- ఫుడ్‌సేఫ్టీ శాఖ అధికారి అశోక్



కీసరరూరల్: మేడ్చల్- మల్కాజ్‌గిరి జిల్లా వైశాల్యంలో చిన్నదైనప్పటికీ జనసాంధ్రతలో అధికం. నగరశివారు ప్రాంతాల్లో పెద్దఎత్తున పరిశ్రమలు ఏర్పాటుచేశారు. నగారానికి చేరువలో ఉండడంతో జీవనోపాధి పొందడానికి వివిధ రకాల పనులు నిర్వహించడానికి రాష్ట్రంలోని నలుమూలలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాకు విచ్చేసి నివాసం ఉంటున్నారు. నిత్యం తమ కార్యకలాపాల్లో నిమగ్నమై, సమయానికి దొరకకపోవడంతో ఇంటి భోజనం కంటే కూడా, అందుబాటులో ఉన్న హోటళ్లు, రెస్టారెంట్లపై ఆధారపడుతున్నారు. ఇదే అదనుగా భావించిన హోటళ్ల నిర్వాహకులు నాసిరకమైన, నిల్వ ఉన్న ఆహార పదార్థాలను వినియోగదారులకు అంటగడుతున్నారు. అదేవిధంగా ధనార్జనే ధ్యేయంగా నిత్యావసరాల సరుకులను కల్తీ చేసి వినియోగదారులకు అమ్మి దండిగా డబ్బులు దండుకుంటున్నారు. వీటన్నింటినీ అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. మేడ్చల్- మల్కాజ్‌గిరి జిల్లాలో చేపట్టిన పలు కార్యక్రమాలపై జిల్లా ఫుడ్‌సేఫ్టీ అధికారి అశోక్ 'ఆంధ్రజ్యోతి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లోని హోటళ్లలో, దాబాల్లో, రెస్టారెంట్లలో నాణ్యమైన ఆహారాన్ని అందించడంలేదు. పాడైన ఆహారాన్ని భుజించి ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న, ప్రమాణాలు పాటించని హోటళ్లల్లో విక్రయిస్తున్న తినుబండారాలు తినడంతో జనాలు ఆసుపత్రుల పాలవుతున్నారు. జిల్లాలో నాసిరకమైన ఆహారాన్ని, సరుకుల కల్తీని అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం. పలు హోటళ్లలో నిల్వ ఉంచిన ఆహారాన్ని విక్రయిస్తున్నారని ప్రజలు తరచూ ఫిర్యాదులు చేస్తున్నారు. అందులో భాగంగా జిల్లాలోని తినుబండారాలు అమ్మే హోటళ్లు, రెస్టారెంట్లు, దాబాలు, స్వీట్‌హౌస్‌లు, రోడ్డు పక్కన ఏర్పాటయ్యే చిన్నపాటి హోటళ్లను తరచూ తనిఖీలు నిర్వహిస్తున్నాం. నాసిరకమైన, నిల్వ ఉన్న ఆహారాన్ని వినియోగదారులకు అందించని వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటున్నాం. తనిఖీల్లో సేకరించిన నమూనాలను పరిశోధనకు పంపించడం జరుగుతుంది. పరీక్షల్లో ఆరోగ్యానికి హానికరమని తేలిన పక్షంలో వారిపై కేసులు నమోదు చేస్తాం. ప్రభుత్వం సూచించిన ప్రమాణాల ప్రకారం లేనిచో వారిని జిల్లా ఉప పాలనాధికారి(జాయింట్ కలెక్టర్) ఆధ్వర్యంలో విచారించి, జరిమానా విదించడం జరుగుతుంది. జిల్లాలో జనవరి నుంచి జూలై వరకు 31 కేసులు నమోదు చేసి రూ.1.34లక్షలు జరిమానా విధించి, వసూలు చేయడం జరిగింది. నిత్యావసర సరుకులు కల్తీ చేసేవరిపై ఎల్లప్పుడు నిఘా ఉంటుంది.

వారిపై కూడా చట్టరీత్యా చర్యలు తీసుకోడం జరు గుతుంది. తక్కువ ధరకు లభిస్తుందని నాసిరకం సరుకులను కొనుగోలు చేయకూడదు. నాణ్యతా ప్రమాణాలు పాటించి, కట్టుదిట్టంగా ప్యాకింగ్ చేసిన వస్తువులనే కొనుగోలు చేయాలి. ఏవిధమైన ప్యాకింగ్, తయారైన, ఎక్స్‌పైరీ తేదీలు లేని వస్తువులను కొనరాదు.

కంప్యూటర్ విద్య మిథ్యేనా..?

- కంప్యూటర్లు ఉన్న బోధకులు లేక నిరుత్సాహంలో విద్యార్థులు
- ఏ పాఠశాలలో చూసినా మూలన పడిన కంప్యూటర్లు



కులకచర్ల బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో వృథాగా ఉన్న కంప్యూటర్లు

కులకచర్ల: ప్రభుత్వం పాఠశాలల్లో విద్యార్థులకు కంప్యూటర్ విద్యను అందించాలన్న ఉద్దేశ్యంతో 2008లో అప్పటి ప్రభుత్వం కంప్యూటర్ విద్యా బోధన ప్రవేశ పెట్టింది. ఈ మేరకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో సాంకేతిక విద్యను అందించేందుకు కంప్యూటర్లు ఏర్పాటు చేసింది. ఒక్కో పాఠశాలకు రూ.లక్ష వెచ్చించి సౌకర్యాలు సమకూర్చారు. ప్రైవేట్ పాఠశాలల కంటే మెరుగ్గా విద్యార్థులకు ఉచితంగా సాంకేతిక విద్యా బోధన చేయాలని నిర్ణయించింది. దీంతో అప్పట్లో తల్లిదండ్రులు ఎంతో సంతోష పడ్డారు. ప్రస్తుతం బోధన చేసే ఉపాధాయులు లేకపోవడంతో కంప్యూటర్ బోధన విద్యార్థులకు దూరమైంది. బోధనా సిబ్బంది లేక, పట్టించుకునే వారు కరువై కంప్యూటర్‌లు దుమ్ముపట్టి పోతున్నాయి. భవిష్యత్‌లో ప్రతి విద్యార్థికి ఏదో రకంగా కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరిగా అవసరం కావడంతో పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు కంప్యూటర్ విద్యను అందించాలని ప్రభుత్వ ఉద్దేశ్యం.

బోధించే వారు లేక..

మండల పరిధిలోని కులకచర్ల బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలతో పాటు చౌడాపూర్, మందిపాల్, ముజాహిత్‌పూర్, పుట్టపహాడ్, బండవెల్కిచర్ల జడ్పీ ఉన్నత పాఠశాలలకు కంప్యూటర్‌లు అందజేశారు. అవి నేడు ఉపయోగంలో లేక వృథాగా ఉన్నాయి. ఇవే కాకుండా జిల్లాలోని 18 మండలాల్లోని 170 ఉన్నత పాఠశాలల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో గతంలో కాంట్రాక్ట్ బోధకులను నియమించారు. వారి గడువు ముగియడంతో శిక్షణ ఇచ్చేవారు లేకుండా పోయారు. కొత్తగా కంప్యూటర్ విద్య కోసం శిక్షకులను నియమిస్తేనే విద్యార్థులకు పాఠశాల స్థాయిలోనే కంప్యూటర్ విద్య అందే అవకాశం ఉంది. అయితే ఇప్పటి వరకు ఆ ఊసే లేకపోవడంతో కంప్యూటర్ విద్య మిథ్యగానే మిగిలిపోయిందని వాపోతున్నారు.



నిరుత్సాహంలో విద్యార్థులు

ప్రభుత్వం 9 సంవత్సరాల క్రితం ఉన్నత పాఠశాలల్లో కంప్యూటర్‌లను ఏర్పాటు చేసింది. సంబంధిత ఫర్నిచర్, జనరేటర్లను అప్పట్లో పంపిణీ చేశారు. విద్యార్థులకు కంప్యూటర్ విద్యపై శిక్షణ ఇచ్చేందుకు ప్రైవేట్ ఏజెన్సీ ద్వారా శిక్షకులను నియమించారు. 2013లో శిక్షణ ఇచ్చేవారి ఒప్పంద గడువు ముగియడంతో పాఠశాలల్లో కంప్యూటర్ సామగ్రి మూలన పడ్డాయి. దీంతో కంప్యూటర్ తరగతులు చెప్పకపోవడంతో విద్యార్థులు నిరుత్సాహ పడుతున్నారు. అధికారులు స్పందించి శిక్షకులను నియమించి కంప్యూటర్ విద్యను అందించాలని విద్యార్థులు కోరుతున్నారు.

ఈ విద్యా సంవత్సరంలోనైనా..

ప్రస్తుత ఈ విద్యా సంవత్సరం ప్రారంభమై మూడు నెలలు గడిచింది. ఇప్పటి వరకు కంప్యూటర్ బోధకులను నియమించలేదు. నూతన జిల్లాల ఏర్పాటు సందర్భంలోనైనా ప్రతి పాఠశాలకు ఒక కంప్యూటర్ బోధకుడిని నియమిస్తే కొంత వరకైనా లక్ష్యం నెరవేరే అవకాశం ఉంది. ఇప్పటికే కంప్యూటర్లన్నీ దుమ్ము, ధూళి మధ్య అధ్వానంగా మారాయి.

నేర్పించే వారు లేరు



మాకు కంప్యూటర్ నేర్చుకోవాలని ఉంది. కానీ నేర్పించేవారు లేరు. మా పాఠశాలలో కుట్టు శిక్షణ ఇస్తున్నారు. అలాగే కంప్యూటర్ శిక్షణ ఇస్తే మాకు అవగాహన ఏర్పడుతుంది. ప్రస్తుతం పాఠశాలలో కంప్యూటర్లు వృదాగా దుమ్ము, దూళి పట్టి ఉన్నాయి. వాటిని వినియోగంలోకి తేవాలి.

- అమృత 9వ తరగతి, బాలికల ఉన్నత పాఠశాల కులకచర్ల

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం



పాఠశాలలో కంప్యూటర్ శిక్షకులు లేక వృథాగా ఉన్నాయి. కంప్యూటర్ శిక్షకులను నియమించాలని అధికారులకు తెలిపాం. కంప్యూటర్ నేర్చుకునేందుకు విద్యార్థులు ఆసక్తితో ఉన్నారు. ఎస్ఎంసీ కమిటీతో చర్చించి ప్రైవేట్ శిక్షకులను నియమించేందుకు ప్రయత్నిస్తున్నాం.

- వెంకటయ్య, హెచ్‌ఎం బాలికల ఉన్నత పాఠశాల, కులకచర్ల

ఉపాధ్యాయులకు కంప్యూటర్ శిక్షణ



కంప్యూటర్ విద్యను అందించేందుకు ప్రత్యేకంగా బోధన ఉపాధ్యాయుల నియామకాలు జరుగలేదు. పాఠశాలల్లో పని చేసే ఉపాధ్యాయుల్లో ఒకరికి శిక్షణ ఇచ్చి కంప్యూటర్ విద్యా బాధ్యతలు అప్పగించేందుకు విద్యాశాఖ అధికారులు యోచిస్తున్నారు. త్వరలోనే విద్యార్థులకు కంప్యూటర్ విద్యతో పాటు డిజిటల్ విద్య అందుబాటులోకి వస్తుంది.

- అబీబ్‌హైమద్ ఎంఈవో

సర్వదోష నివారకుడు గరుత్మంతుడు

భక్తి

షాద్‌నగర్: వేదస్వరూపుడైన గరుత్మంతుడిని భక్తితో పూజిస్తే సర్వదోష నివారణ చేకూరుతుందని షాద్‌నగర్ వేంకటేశ్వరస్వామి ఆలయ పూజారి శ్రీనివాసచార్యులు పేర్కొన్నారు. షాద్‌నగర్ పట్టణ ముఖద్వారంగా వెలిసి, భక్తుల పాలిట కొంగుబంగారంగా వెలుగొందుతున్న శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయం ఎదుట 11 ఫీట్ల ఎత్తులో ఏకశిల విగ్రహంగా గరుత్మంతుడు వెలిశాడు. పరమటి దిశగా ఉన్న ఆలయ ముఖద్వారం వైపు గరుత్మంతుడు, తూర్పు దిశగా ఆంజనేయస్వామి విగ్రహాలను ఏకశిలకు చెక్కించి ప్రతిష్టించారు. మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు కృషితో ప్రతిష్టించబడిన గరుత్మంతుడికి ఆలయ బ్రహ్మోత్సవాలు, గరుడ పంచమి రోజు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. విష్ణువు దర్శనానికి వచ్చే భక్తులు ముందుగా సర్పరాజులనే ఆభరణాలుగా ధరించిన వేదమూర్తి గరుత్మంతుడిని దర్శించుకోవాలి. భక్తితో పూజిస్తే సర్వదోష నివారణతో పాటు సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని శ్రీనివాసచార్యులు తెలిపారు.


శ్రీనివాసచార్యులు, ఆలయ పూజారి


కొలువుతీరిన గరుత్మంతుడు

కొత్త జిల్లాల వారీగానే ఉద్యోగ నియామకాలు జరగాలి

- జిల్లా గెజిటేడ్ ప్రధానోపాధ్యాయ సంఘం ప్రధానకార్యదర్శి గిరిధర్

ఉద్యోగపర్వం



షాద్‌నగర్: వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి, పరిపాలన సౌలభ్యం కోసం ఏర్పాటు చేసిన కొత్త జిల్లాల వారిగానే ఉద్యోగ నియమకాలు జరగాలి. ప్రభుత్వం పాత జిల్లాల వారిగా ఉద్యోగ నియమకాల కోసం నోటిఫికేషన్లను ఇస్తామనడం సరికాదు. వెనుకబడిన ఉభయ పాలమూరు జిల్లా ప్రాంతం ఆరు జిల్లాల పరిధిలోకి మారింది. షాద్‌నగర్ ప్రాంతం రంగారెడ్డి జిల్లాలోకి మారింది. పాత జిల్లాల వారిగా ఉద్యోగ నియామకాలను కొనసాగిస్తే షాద్‌నగర్ ప్రాంత వాసి, పాత పాలమూరు జిల్లాలో స్థానికుడు ఎలా అవుతాడు. పాత జిల్లాల వారిగా ఉద్యోగ నియమకాలు జరిగితే మారుమూల ప్రాంత జిల్లాల్లో పనిచేయడానికి ఏ ఒక్కరు ఇష్టపడరు. అక్కడున్న ఖాళీలు అలాగే మిగిలిపోతాయి. అలాగే ఖాళీల భర్తీలోనూ... ఆ తరువాత పదోన్నతుల్లోనూ న్యాయపరమైన సమస్యలు తలెత్తుతాయి. ఉద్యోగ నియామకాలకు సైతం న్యాయపరమైన చిక్కులు ఎదురవుతాయి. ప్రభుత్వం పునరాలోచించి, కొత్త జిల్లాల వారిగానే ఉద్యోగ నియామకాల నోటిఫికేషన్లను ఇవ్వాలి.

అక్రమంగా కొనసాగుతున్న వాటర్‌ప్లాంట్లపై ఆరా

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలో కొనసాగుతున్న వాటర్ ప్లాంట్లపై బుధవారం విజిలెన్స్ అధికారులు ఆరా తీశారు. అనుమతి లేకుండా వాటర్ ప్లాంట్లను నిర్వహిస్తూ ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్న నీటి వ్యాపారులపై చర్యలు తీసుకుని కేసులు నమోదు చేయడానికి అధికారులు సిద్ధమవుతున్నారు. బుధవారం ఉదయం గాజులరామారం డీసీ విజయ్‌కుమార్‌ను కలిసిన విజిలెన్స్ అధికారులు శ్రీనివాస్‌రెడ్డి, విజయ్‌కుమార్, నరేందర్‌రెడ్డిలు రెండు సర్కిళ్ల పరిధిలో ఎన్ని ప్లాంట్లకు అనుమతులు ఉన్నాయి. అక్రమ కొనసాగుతున్నవి ఎన్ని అని పక్కా లెక్కలు తీయడానికి రంగంలోకి దిగారు. వైద్యాధికారి డాక్టర్ శివప్రసాద్‌ను విజిలెన్స్ అధికారులు ప్రశ్నల వర్షం కురిపించారు.రికార్డును కూడా పరిశీలించి చర్యలు తీసుకోవడానికి సిద్ధమవుతున్నారు.

బాధిత కుటుంబానికి పరిహారం అందజేత

షాపూర్‌నగర్: పరిశ్రమల్లో, భవన నిర్మాణంలో పనిచేస్తున్న కార్మికులకు విధి నిర్వాహణలో ప్రమాదాలు జరిగితే వారిని ప్రభుత్వం ఆదుకోవాలని కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. బుధవారం షాపూర్‌నగర్‌లోని ఆయన నివాసంలో జరిగిన కార్యక్రమంలో సెంట్రింగ్ కాంట్రాక్టర్ టి. వెంకట్రావు అనారోగ్యంతో చనిపోగా అసోసియేషన్ వారు అసోసియేషన్ నుంచి 25వేలు నగదును మృతుని భార్యకు శ్రీశైలంగౌడ్ చేతుల మీదుగా అందజేశారు. మృతుని కుటుంబానికి అసోసియేషన్ సభ్యులు పెద్దమనస్సుతో సహాయం చేయడం హర్షనీయం అన్నారు. కార్యక్రమంలో సెంట్రింగ్ అసోషియేషన్ అధ్యక్షులు చాంద్‌బాషా, సెక్రెటర్ ఎండి. మగ్బుల్, ఛైర్మన్ డి. పద్మారావు, సాగర్, కుమ్మరి నర్సింహలు పాల్గొన్నారు.

ఆటోలను తొలగించిన ట్రాఫిక్ పోలీసులు



చలాన్ రాస్తున్న ట్రాఫిక్ పోలీసులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మేడ్చల్ : 'కలెక్టర్ ఆదేశించినా తీరని ట్రాఫిక్ సమస్య' కథనంపై ఎట్టకేలకు ట్రాఫిక్ పోలీసులు స్పందించారు. మేడ్చల్ జాతీయ రహదారిపై నిత్యం ఆటోలతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుందనీ, దీనిపై ఇటీవల జరిగిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ ఆదేశించినా సమస్య పరిష్కారం కావడం లేదని ఈ నెల 22న ఆంధ్రజ్యోతి మేడ్చల్ జోన్‌లో ప్రచురితమైన కథనానికి స్పందించిన అల్వాల్ ట్రాఫిక్ పోలీసులు స్పందించారు. బుధవారం మేడ్చల్ పట్టణంలో జాతీయ రహదారిపై నిలిపిన ఆటోలకు ట్రాఫిక్ పోలీసులు జరిమానాలు విధించారు. 20 ఆటోలకు జరిమానా విధించడంతో పాటు ఎటువంటి పత్రాలు లేని పది ఆటోలను సీజ్ చేశారు. ట్రాఫిక్ ఎస్ఐలు కిషోర్, చంద్రశేఖర్‌రెడ్డి, సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు. జాతీయరహదారిపై ఇష్టానుసారంగా ఆటోలను నిలపవద్దని ఈ సందర్భంగా ట్రాఫిక్ పోలీసులు ఆటో డ్రైవర్‌లకు సూచించారు.

అత్తారింటి ఎదుట వివాహిత ఆందోళన

బోడుప్పల్: వరకట్న వేధింపులు తాళలేక ఓ వివాహిత అత్తారింటి ముందు బైఠాయించి ఆందోళనకు దిగిన సంఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని బోడుప్పల్ లక్ష్మీనగర్‌లో చోటు చేసుకుంది. సదరు వివాహిత, ఆమె తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం.... మీర్‌పేట్‌కు చెందిన యాదయ్య కూతురు దివ్యకు ముషీరాబాద్‌కు చెందిన జామకాయల రవికిరణ్‌తో రెండు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. పెళ్ళి సమయంలో రూ.20 లక్షల వరకు కట్న కానుకలను ఇచ్చిఘనంగా వివాహం జరిపారు. కొంత కాలం తరువాత భర్త రవికిరణ్‌తో పాటు ఆమె అత్తమామలు, ఆడపడుచులు అదనపు కట్నం తేవాలని వేధింపులను ప్రారంభించారు. అదే క్రమంలో వంట గ్యాస్‌ను లీక్ చేసి హతమార్చే ప్రయత్నం చేసినట్లు బాధితురాలు ఆరోపించింది. దీంతో సరూర్‌నగర్ మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా స్పందన లేదని, మేడిపల్లి పోలీసులు ఫిర్యాదు తీసుకోవడం లేదని సదరు వివాహిత వాపోయింది. దీంతో గత్యంతరం లేక అత్తారింటి ఎదుట బైఠాయించి ఆందోళన చేస్తున్నట్లు ఆమె తెలిపింది. కాగా దివ్య నుంచి తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని మేడిపల్లి పోలీసులు పేర్కొన్నారు.

ఇంటింటికి వెళ్లి టీకాలు వేసేందుకు చర్యలు

● సమీక్షా సమావేశంలో కలెక్టర్ ఎం.వీ.రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎం.వి.రెడ్డి

కీసర రూరల్: పశువులకు ఇంటింటికి వెళ్లి టీకాలు వేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ యం.విరెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పశుసంవర్ధక శాఖ పురోగతిపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గొర్రెల పంపిణీలో రాష్ట్రంలోనే మన జిల్లా చివరి స్థానంలో ఉండడంతో పాటు హరితహారంలో కూడా అనుకున్నంత స్థాయిలో పురోగతి సాధించకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. గొర్రెల పంపిణీ, హరితహారంలో లక్ష్యాన్ని సాధించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గొర్రెల పంపిణీ, హరితహారంలో పశుసంవర్ధక శాఖ వెనుకబడి ఉండడానికి గల కారణాలపై సమీక్షించుకోవాలని సూచించారు. పశు సంవర్ధక శాఖకు గొర్రెల పంపిణీ 1, 945 యూనిట్లు లక్ష్యం కాగా, ఇప్పటివరకు 1020 యూనిట్లను పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. ప్రతి రోజు 50 నుంచి 100 యూనిట్లు పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. డిసెంబర్ వరకు వేచి చూడకుండా ఆలోపే పంపిణీ ప్రక్రియను పూర్తి చేయాలని సూచిం చారు. హరిత హారంపై సమీక్షిస్తూ అన్ని శాఖల కంటే పశు సంవర్ధక శాఖ అతి తక్కువగా మొక్కలు నాటారని అసంతృప్తి వ్యక్తం చేశారు. చెరువుల వారీగా లక్ష్యాలను నిర్ధేశించి మొక్కలు నాటాలని పురోగతి సాధించని పక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సర్పంచులు, కార్యదర్శులను సమన్వయం చేసుకుని అవకాశం ఉన్న చోట పశుగ్రాసం పెంచేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పశువులకు 100 శాతం టీకాలు వేయాలని మిగిలిన వాటికి ఇంటింటికి వెళ్లి వేయాలని ఆదేశించారు. పశుసంపదను పెంపొందించడంతోపాటు పాలు, మాంసం ఉత్పత్తి పెరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో పశు సంవర్ధక శాఖ అధికారి విజయశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

'విమోచన దినాన్ని అధికారికంగా నిర్వహించాలి'

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు కాంతారావు



సమావేశంలో మాట్లాడుతున్న బీజీపీ జిల్లా అధ్యక్షుడు కాంతారావు

కీసర రూరల్: సెప్టెంబర్ 8న నిర్వహించే కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా బీజేపీ అధ్యక్షుడు మాధవరం కాంతారావు పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా పార్టీ కార్యాలయంలో పార్టీ పదాధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ విమోచన దినం సెప్టెంబర్ 17ను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ సంస్థానంలో భాగంగా ఉండి విమోచన పొందిన మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లోని జిల్లాల్లో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు సెప్టెంబర్ 17న ఉత్సవాలను అధికారికం గా నిర్వహిస్తున్నారు. రాష్ట ప్రభుత్వం ఈ ఉత్సవాలను నిర్వహించకపోవడం విచారకరమన్నారు. ఉద్యమ కాలం లో కేసీఆర్ సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించాలని, ఇది తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి సంబంధించిన విషయమని ప్రగల్బాలు పలికి అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు పూర్తి కావస్తున్నా ఆ వైపు గా అడుగులు వేయడం లేదని ఆయన విమర్శించారు. కేవలం ఎంఐఎంకు భయపడి సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించడం లేదని ఎద్దేవా చేశారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షను గౌరవిస్తూ సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించాలని కోరుతూ సెప్టెంబర్ 8న మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు వెల్లడించారు. ఈ ముట్టడి కార్యక్రమానికి తెలంగాణ వాదులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేసి, ప్రభుత్వం కళ్ళు తెరిపించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు గౌలికర్ ఆనంద్, ప్రియతమ్ రామకృష్ణ, జిల్లా ప్రధానకార్యదర్శి సత్తిరెడ్డి, కార్యదర్శులు రాజ్యలక్ష్మి, సుజాత, రజినీరెడ్డి, నాయకులు శ్రీనివాస్‌ముదిరాజ్, డి.వెంకటేష్, అమతం మోహన్‌రెడ్డి, హరినాయక్, సులోచన, తదితరులు పాల్గొన్నారు.

నిధుల కోసం నివేదికల రూపకల్పన

శామీర్‌పేట: మండలంలోని వివిధ గ్రామ పంచాయతీ కార్యాలయాలను బుధవారం ప్రత్యేక అధికారులుగా జిల్లా, మండల స్థాయి అధికారులు సందర్శించారు. కలెక్టర్ ఎం.వీ.రెడ్డి ఆదేశాల మేరకు అధికారులు పంచాయతీ కార్యాలయాలకు విచ్చేసి సీఎం కేసీఆర్ ప్రత్యేక నిధులతో పలు గ్రామాభివృద్ధి పనులు, ప్రజలకు అవసరమైన మౌలిక సౌకర్యాలను కల్పించేందుకు సర్పంచులు, వార్డు పభ్యులు, ప్రజాప్రతినిధులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. సీఎం ప్రత్యేక నిధులతో చేపట్టడానికి గ్రామాభివృద్ధి పనుల వివరాల అంచనాల ప్రణాళికలను ప్రత్యేక అధికారులు మండలంలోని గ్రామాల ప్రజాప్రతినిధులతో చర్చించి నివేదికలను తయారు చేశారు. నూతనంగా చేపట్టనున్న గ్రామాభివృద్ధి పనుల ప్రణాళికల అంచనాల నివేదికలను ఆయా గ్రామాల సర్పంచులు ప్రత్యేక అధికారులకు అందజేశారు. మండలంలోని అనంతారం గ్రామ పంచాయతీకి మండల ఈవోపీఆర్డీ మల్లికార్జున్, అద్రాస్‌పల్లికి డీసీవో, అలియాబాద్‌లో డీఈవో ఉషారాణి, నారాయణ్‌పూర్‌కు ఆర్‌డబ్లుఎస్ డిప్యూటీ ఈఈ, పోతాయిపల్లి తహసీల్దార్ శ్రీకాంతరెడ్డి, ఉప్పర్‌పల్లికి డిప్యూటీ ఎస్ఈ, కేశ్వాపూర్ కు కీసర తహసీల్దార్, ఉద్దమర్రికి వ్యవసాయశాఖ ఏడీ, పొన్నాల్‌కు డీఆర్‌డీవో బొమ్మరాసిపేటకు ఐసీడీఎస్ పీడీ, లాల్‌గడి మలక్‌పేట్‌కు ఎంపీడీవో జ్యోతి, శామీర్‌పేటకు ఈఈ పీఆర్, తుర్కపల్లికి హార్టికల్చర్ ఎడి, తూంకుంటకు ఆర్డీవో, కొల్తూర్‌కు పీఆర్ డిప్యూటీ ఈఈ శ్రీనివాస్‌రెడ్డి, మజీద్‌పూర్‌కు ఆర్అండ్‌బి డిప్యూటీ ఈఈ మాదవి, దేవర్‌యాంజాల్‌కు డీపీవో సురేష్ మోహన్, జగ్గంగూడకు అగ్రి అర్బన్ ఏడీలు విచ్చేసి ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ అధికారులకు గ్రామ సర్పంచులు, ఇతర ప్రజాప్రతినిదులు గ్రామాభివృద్ధి పనుల వివరాల నివేదికలను సమర్పించారు. కాగా తూంకుంట పంచాయతీ కార్యాలయంలో ఎంపీపీ చంద్రశేఖర్‌తో పాటు సర్పంచ్ నాగేశ్, పంచాయతీ వార్డు సభ్యులు స్పెషల్ ఆఫీసర్‌గా విచ్చేసిన ఆర్డీవో హనుమంతరెడ్డితో చర్చించి సీఎం ప్రత్యేక నిదులతో చేపట్టనున్న పలు నూతన గ్రామాభివృద్ధి పనుల అంచనాల నివేదికలను ఆర్డీవోకు అందజేశారు. అలాగే పోతాయిపల్లి పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ లావణ్య, ప్రజాప్రతినిధులతో స్పెషలాఫీసర్‌గా తహసీల్ధార్ శ్రీకాంత్‌రెడ్డి ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి సీఎం ప్రత్యేక నిధులతో చేపట్టనున్న గ్రామాభివృద్ధి పనుల అంచనాల వివరాల నివేదికను తయారు చేసి పరిశీలించారు.



నివేదికను ఆర్డీవోకి సమర్పిస్తున్న ఎంపీపీ చంద్రశేఖర్



అభివృద్ధి పనుల అంచనాల నివేధికను పరిశీలిస్తున్న తహసీల్దార్

రామకృష్ణాపురం రైతు బజార్‌లో కూరగాయల ధరలు

నేరేడ్‌మెట్: టమాట-43, వంకాయ-25, బెండకాయ-23, పచ్చిమిర్చి-23, కాకరకాయ- 18, బీరకాయ-18, క్యాబేజి-17, బీన్స్-33, క్యారెట్-41, కాలిఫ్లవర్-18, దొండకాయ-25, చిక్కుడు-43, గోకరకాయ-23, బీట్‌రూట్-23, కాప్సికం-31, ఆలుగడ్డ-15, కీరా-13, దోసకాయ-15, సొరకాయ-13, పొట్లకాయ-13, కందగడ్డ-21, అరటి-10, చామగడ్డ-25, ముల్లంగి-9.



ప్రశాంత్‌కాలనీ పార్కు నిర్లక్ష్యపు మార్కు

- రెండేళ్లు గడుస్తున్నా.. పూర్తికాని పనులు
- నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులు
- అందుబాటులోకి తేవాలి: కాలనీవాసులు
- కార్పొరేటర్ కార్యాలయంగా కమ్యూనిటీహాల్



శిథిలావస్థకు చేరిన పిల్లల ఆట పరికరం, పార్కు అవరణలో డంపింగ్ చేసిన డ్రమ్ములు, కంకర(ఫైల్)

మౌలాలి: మల్కాజిగిరి సర్కిల్ మౌలాలి డివిజన్‌లోని ప్రశాంత్‌నగర్‌కాలనీలో సుమారు ఎకరం స్థలం చాలా ఏళ్లుగా నిరుపయోగంగా ఉంది. ఆంధ్రప్రదేశ్ హౌజింగ్ బోర్డు 1980 ఏర్పాటు చేసిన లే అవుట్‌లో సుమారు వెయ్యి ఇళ్ల నిర్మాణం చేపట్టారు. లే అవుట్‌లో ఎకరం స్థలం (ప్లే గ్రౌండ్) ఆటస్థలానికి కేటాయించారు. ఈ లేఅవుట్‌లో 145 ఇళ్లతో పాటు ప్లే గ్రౌండ్ స్థలం కూడా మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోకి వచ్చింది. ఈ స్థలంలో అప్పటి ఎమ్మెల్యే సాయన్న నిధులు కేటాయించి కమ్యూనిటీహాలు నిర్మించడంతో కాలనీవాసులు ఉపయోగించుకొనేవారు. 2004లో కమ్యూనిటీహాలును వార్డు కార్యాలయంగా మార్చేశారు. దీంతో అప్పటి నుంచి కమ్యూనిటీహాలును కాలనీవాసులు ఉపయోగించుకోలేని పరిస్థితి ఏర్పడింది. ఈ ఖాళీ స్థలం చుట్టూ ప్రహరీ నిర్మాణం, గ్రిల్స్ ఏర్పాటుకు నాలుగేళ్ల క్రితం సుమారు 12 లక్షల నిధులు కేటాయించారు. పనులు మొదలుపెట్టిన కాంట్రాక్టర్ పనులను మధ్యలోనే వదిలివేశారు. నాటి నుంచి పనులు ముందుకు సాగక, ఖాళీ స్థలాన్ని పార్కుగా వినియోగించుకోలేక కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు.

వాకింగ్ ట్రాక్ పూర్తి అయ్యేదెన్నడో?

నిత్యం ఉద్యోగం, పనుల ఒత్తిడిలో ఆరోగ్యంపై ప్రజలు శ్రద్ధ చూపడం లేదు. కనీసం కాలనీలో ఉన్న ఖాళీ స్థలంలో వాకింగ్ చేయడానికి, చిన్నారులు ఆటలు ఆడుకోవడానికి పార్కుగా అభివృద్ధి చేయాలని కాలనీవాసులు ఎదురు చూస్తున్నారు. కానీ వాకింగ్ ట్రాక్ నిర్మాణం చేపట్టి సంవత్సరాలు గడుస్తున్నా ఎలాంటి పురోగతి లేదు. నిధులు మంజూరైనా పనులు పూర్తికాకపోవడంతో ప్రజలు నిరాశ చెందుతున్నారు. విశాలమైన స్థలంలో వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తున్నామని చెప్పి పనులు ప్రారంభించి మధ్యలోనే నిలిపివేయడంతో పార్క్ స్థలం నిరుపయోగంగా మారింది. పార్కు విషయం అధికారులను ప్రశిస్తే ఆ స్థలం కోర్టు కేసులో ఉన్నందున పనులు నిలిపివేశామని పేర్కొంటున్నారు. పార్కుకు కేటాయించిన నిధులను కమ్యూనిటీహాలులో ఫ్లోరింగ్ కోసం మ్లలంచినట్లు మరో అధికారి చెబుతున్నారు. నిర్మాణం మధ్యలోనే నిలిచిపోవడంతో లక్షల నిధులు నిరుపయోగంగా మారాయని కాలనీవాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందిచి తగు చర్యలు తీసుకొని వాకింగ్ ట్రాక్‌ను అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు.

డంపింగ్ యార్డుగా మార్చారు

కాలనీలో ఉన్న ఖాళీ స్థల ంలోని కమ్యూనిటీ హాలును డంపింగ్ యార్డుగా తయారు చేశారు. చిన్నారులు ఆడుకోవడానికి ఏర్పాటు చేసిన వస్తువులు శిథిలావస్థకు చేరుకున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. కమ్యూనిటీహాలులో సిమెంట్ బస్తాలు, ఇతర వస్తువులు డంపింగ్ చేయడంతో పాటు ఆవరణలో చెట్ల కొమ్మలు వేసి డంపింగ్ స్థలంగా మార్చారు. కనీసం సాయంత్రం వేళల్లో వృద్ధులు సేదతీరడానికి స్థలం లేకుండా చేశారు. వాకింగ్ ట్రాక్‌ను పూర్తి చేయడంతో పాటు గ్రీనరిని పెంచి పార్కుగా తీర్చిదిద్దేలా ప్రజా ప్రతినిధులు, అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

తగిన చర్యలు తీసుకుంటాం



కాలనీలోని కమ్యూనిటీహాలును వార్డు కార్యాలయంగా మార్చారు. దీంతో కాలనీవాసులకు ఉపయోగం లేకుండా పోయింది. కమ్యూనిటీ హాలును కాలనీవాసులకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తా. పార్కు స్థలంలో పెండింగ్‌లో ఉన్న వాకింగ్ ట్రాక్, గ్రిల్స్ ఏర్పాటు చేసి, చిన్నారులకు ఆట వస్తువులను ఏర్పాటు చేయిస్తా. మౌలిక వసతులు ఇతర పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటా.

- కార్పొరేటర్ ముంతాజ్‌ఫాతిమా

'కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి'



మాట్లాడుతున్న సీనియర్ కాంగ్రెస్ నాయకుడు శంకర్‌గౌడ్

యాప్రాల్: జవహర్‌నగర్‌లో కాంగ్రెస్ పార్టీ పటిష్టత కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని జవహర్‌నగర్ గ్రామ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, మాజీ సర్పంచ్ శంకర్‌గౌడ్ అన్నారు. బుధవారం బాలాజీనగర్‌లో నవరస గార్డెన్‌లో జరిగిన ఫేస్-1 గ్రామ కాంగ్రెస్ పార్టీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజల సమస్యలపై అనునిత్యం కాంగ్రెస్ పార్టీ పోరాడుతుందని ఆయన అన్నారు. అనంతరం ఫేస్-1 కాంగ్రెస్ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా బండకింది ప్రసాద్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా ఎండి.రఫిక్, కోశాధికారిగా నర్సింహారెడ్డిలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రవీందర్‌గుప్త, సత్యనారాయణలు పాల్గొన్నారు.

సహకార సంఘ నిర్వహణపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న వెంకన్న

అల్వాల్: అల్వాల్ సిండికేట్ రైతు సేవా సహకార సంఘం కార్యాలయంలో బుధవారం సంఘ నిర్వహణ అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కోఆపరేటివ్ ట్రేనింగ్ సెంటర్ ప్రిన్సిపాల్ బూక్య వెంకన్న ముఖ్య అతిథిగా హాజరై సభ్యులకు రుణ పరిమితి, ఇతర అవసరాలు, సత్వర సేవలు, భవిష్యత్తు కార్యచరణ ప్రణాళికలపై ఆయన వివరించారు. సంఘాన్ని సభ్యులు తమ అవసరాలను గుర్తించి చట్టపరంగా నిబంధనల ప్రకారం సక్రమంగా లెక్కలు చూసుకుంటూ సంఘాన్ని అభివృద్ధి చేయడంతో పాటు ఆదర్శంగా నిలవాలని కోరారు. సంఘం మేనేజింగ్ డైరెక్టర్ సిద్దయ్య మాట్లాడుతూ సభ్యులకు కావాల్సిన రుణాలు, లాకర్స్, ఎరువులు, అమ్మకాలు వంటి సేవలను చేస్తున్నామని పేర్కొన్నారు. సంఘంలో బ్యాంకు నిబంధనల ద్వారా సేవలను నిర్వహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. నెఫ్ట్, ఆర్‌టీజీఎస్, ఆపరేషన్స్, ఇన్‌వర్డ్, ఔట్ వర్డ్, సిండికేట్ బ్యాంకు ద్వారా నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అల్వాల్ రైతు సేవా సహకార సంఘం అధ్యక్షుడు తోట జశ్వంత్‌రెడ్డి, డిప్యూటీ రిజిస్ట్రార్ నాగమణి, వైస్ ప్రెసిడెంట్ రాజ్‌పుత్ పుల్‌చంద్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

మినీ ట్యాంక్‌బండ్‌పై నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

మల్కాజిగిరి : వినాయక చవితి, అనంతరం నిమజ్జనంకు సంబంధించిన ఏర్పాట్లను రాచకొండ ఇన్‌చార్జి సీపీ సందీప్‌శాండిల్య, జాయింట్ సీపీ తరుణ్‌సింగ్‌లతో పాటు ఉత్సవ సమితి నిర్వాహకులు, వివిద శాఖల అధికారులు బుధవారం పరిశీలించారు. మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని సఫిల్‌గూడ మినీట్యాంక్‌బండ్ పై నిమజ్జనం ఏర్పాట్లు, క్రేన్‌ల వసతి, విద్యుత్ స్టాండ్‌బై ట్రాన్స్‌పార్మర్ల ఏర్పాటు. ట్రాఫిక్ సమస్యలు. భక్తుల రద్దీ తదితర విశయాలను స్థానిక పోలీసులు,. ఉత్సవసమితి నిర్వాహకులు, జిహెచ్‌ఎంసీ అధికారుల తో చర్చించారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకుని పండుగను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో రాచకొండ కమిషనరేట్ జాయింట్ సీపీ తరుణ్‌జోషి, మల్కాజిగిరి డీసీపీ ఉమామహేశ్వర శర్మ, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, ప్రభాకర్‌రెడ్డి, నేరేడ్‌మెట్ ఇన్‌స్పెక్టర్ జగదీష్‌చందర్, కార్పొరేటర్ జగదీష్ గౌడ్, మల్కాజిగిరి జిహెచ్‌ఎంసీ సర్కిల్ డీసీ వేణుగోపాల్, ఈఈ అనిల్‌రాజ్, ఉత్సవ సమితి కన్వీనర్ పిట్ల మోహన్‌రాజ్, శ్రావణ్‌కుమార్, బుజ్జి, ఉడుతనవీన్, శివానంద్, ప్రియతం రామకృష్ణ, ఆనంద్, బక్కనాగరాజు, వాసంశెట్టి శ్రీనివాస్ పలువురు పాల్గొన్నారు.

'ఇంటింటికి తాగునీరు అందించడమే ధ్యేయం'



మిషన్ భగీరథ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కనకారెడ్డి

అల్వాల్: మిషన్ భగీరథ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తాగునీటిని అందివ్వాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ముందుకు పోతోందని మల్కాజిగిరి ఎమ్మెల్యే చింతల కనకారెడ్డి అన్నారు. బుధవారం అల్వాల్ డివిజన్‌లోని గ్రీన్ ఉడ్ కౌంటి కాలనీలో ఆయన మంచినీటి సరఫరాను కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కనకారెడ్డి మాట్లాడుతూ గత ఎన్నికలలో ఇచ్చిన హామీలను తూచాతప్పకుండా తమ ప్రభుత్వం నిర్వహిస్తుందని పేర్కొన్నారు. హడ్కో నిధుల కింద నిర్మాణమవుతున్న రిజర్వాయర్లు పూర్తయితే ప్రతి రోజు అల్వాల్ ప్రజలకు తాగునీటిని అందించే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే పాత డిస్ట్రిబ్యూషన్ లైన్‌లను తొలగించి వాటి స్థానంలో కొత్త వాటిని వేయడం జరిగిందన్నారు. మురుగునీరు రాకుండా స్వచ్ఛమైన నీటిని అందించే విధంగా పక్కా ప్రణాళికతో ముందుకు పోతున్నామన్నారు. ప్రతి కాలనీకి బస్తీలలో తాగునీటి సరఫరా అయ్యే విధంగా చర్యలను తీసుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కో ఆప్షన్‌మెంబర్ జ్యోతి, వాటర్ వర్క్స్ డీజీఎం రజిని, కాలనీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, శశికాంత్, అమర్‌నాథ్, హన్మంత్‌రావు, టి.శ్రీనివాస్, వేణుగోపాల్, గోపి, సంగీత, సుకన్య, స్మిత, ప్రేమ్‌కుమార్, లక్ష్మణ్, మధుసూదన్‌రెడ్డి, రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

బాలసర్వస్వతినగర్‌లో ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం



ట్రాన్స్‌ఫార్మార్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్

మల్కాజిగిరి : మల్కాజిగిరి డివిజన్ పరిధిలోని బాలసరస్వతి నగర్‌లో నూతనంగా ఏర్పాటుచేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను కార్పొరేటర్ ఎన్. జగదీష్‌గౌడ్ బుధవారం స్విచ్‌ఆన్ చేసి ప్రారంభించారు. బాలసరస్వతినగర్ వాసులకు సర్ధార్‌పటేల్‌నగర్ తదితర ప్రాంత ప్రజలకు ఇకపై విద్యుత్ సమస్య ఉండదని అన్నారు. కార్యక్రమంలో విద్యుత్ విభాగం ఏఈ వేణుగోపాల్, నాయకులు ఉపేందర్, శ్రీకాంత్, సురేషఖ , కాలనీ వాసులు ఆగమయ్య, ఎల్లయ్య , ప్రసాద్, శాలిని, జయశ్రీ, కరీం, శ్రీనివాస్, నరేష్ లు పాల్గొన్నారు.

'పండగలను శాంతియుతంగా నిర్వహించుకోవాలి'



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

వికారాబాద్ అర్బన్ : ఈ నెలలో జరిగే వినాయక చవితి, బక్రీద్ పండుగలను శాంతియుత వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివ్య ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేటులోని తన చాంబర్‌లో వినాయక చవితి, బక్రీద్ పండుగల నిర్వాహణప శాంతి కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. పండుగలను సోదర భావంతో జరిగేలా చూడాల్సిన అవసరం మన అందరిపై ఉందని ఆమె అన్నారు. వినాయక మండపాలకు గాను విద్యుత్తు శాఖకు రూ. 500 చెల్లించినట్లయితే విద్యుత్తు కనెక్షన్ ఇవ్వడం జరుగుతుందన్నారు. దీని వల్ల ప్రమాదాలు నివారించేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. విద్యుత్ వైర్లకు కొండీలు వేయడం వల్ల షాట్ సర్క్యూట్ జరిగే ప్రమాదం ఉంటుందని ఆమె అన్నారు. నిమజ్జనం పూర్తయ్యే వరకు గణేష్ మంటపాలను నిరంతర విద్యుత్‌ను అందించేందుకు చర్యలు తీసుకోవాలని విద్యుత్తు శాఖ అధికారులను ఆదేశించారు. విగ్రహాలను నిమజ్జనానికి తీసుకువెళ్లేటప్పుడు ఇబ్బంది కలుగకుండా కేబుల్ వైర్లను తీసి వేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఆగస్టు 29న తాండూరులో అదే విధంగా సెప్టెంబర్ 4న వికారాబాద్, పరిగి, కొడంగల్ ప్రాంతాలలో భారీగా నిమజ్జనం జరుగుతుందని అట్టి రోజుల్లో ఉదయం 6 గంటల నుండి మరుసటి రోజు ఉదయం 6 గంటల వరకు మద్యం దుకాణాలను మూసి వేయాలని ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. నిమజ్జనానికి అవసరమైన క్రేన్‌లతో పాటు వైద్య సిబ్బందిని కూడా నిమజ్జన ప్రాంతాల్లో అందుబాటులో ఉండేలా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. సెప్టెంబర్ 2న జరిగే బక్రీద్ పండుగ సందర్భంగా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా ముందస్తుగానే చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులకు సూచించారు. పండుగను పురస్కరించుకొని గోవులను వధించకుండా చూడాలన్నారు. ఇతర జంతువులను వధించేందుకు ముందస్తుగానే సంబంధిత అధికారుల వద్ద నుండి ధృవీకరణ పత్రాన్ని పొందాల్సి ఉంటుందని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ అన్నపూర్ణ, డీపీఓ మాజీద్, పశు సంవర్ధక శాఖాధికారి సుబ్బారావు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ వరప్రసాద్, ఆర్‌అండ్‌బీ ఈఈ బికె ప్రతాప్, విద్యుత్ ఈఈ దుర్గారావు, డీఎస్పీ టి.స్వామి, మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణరెడ్డి, తహసీల్దార్ చిన్న అప్పల నాయుడులతో పాల్గొన్నారు.

బస్సు ఆపాలని రాస్తారోకో



ఆందోళన చేస్తున్న విద్యార్థులు

తాండూరు : తాండూరు -హైదరాబాద్ రోడ్డు మార్గంలోని హాస్టళ్ల వద్ద ఆర్టీసీ బస్సులను ఆపాలని బుధవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. గంటపాటు జరిగిన రాస్తారోకోలో ఆర్టీసీకి చెందిన బస్సు అద్దాలను ధ్వంసం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడు యాదగిరి మాట్లాడుతూ బీసీ బాలుర హాస్టల్ విద్యార్థులకు బస్సును ఆపడం లేదని, విద్యార్థుల పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని పేర్కొన్నారు. హాస్టల్ వద్ద తాండూరు, వికారాబాద్ డిపోకు చెందిన బస్సులను రెక్వెస్ట్ స్టాప్ కింద ఆపాలని డిమాండ్ చేశారు. తాండూరు ఆర్టీసీ డీఎం కృష్ణమూర్తి అక్కడికి చేరుకుని తక్షణమే రెక్వెస్ట్ బస్‌స్టాప్ ఏర్పాటు చేసి బస్సులను ఆపుతామని విద్యార్థులకు హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ధర్నాలో ఎస్ఎఫ్ఐ జిల్లా సోషల్ మీడియా ఇన్‌చార్జ్ శ్రీనివాస్, హాస్టల్ విద్యార్థులు పాల్గొన్నారు.

బ్యాంకు ఖాతాల్లోకే ఉపాధి కూలి

- ఉపాధి డబ్బులు బ్యాంకుల ద్వారా చెల్లింపునకు శ్రీకారం
- ఉపాధి కార్డులకు ఆధార్‌తో అనుసంధానం
- పోస్టాఫీస్ చెల్లింపులకు ఇక స్వస్తి



కొడంగల్: ఉపాధిహామీ పథకంలో పని చేసే కూలీల వేతనాలను ఇక నుంచి బ్యాంకు ద్వారా అందించేందుకు ప్రభుత్వం భావిస్తుంది. అందులో భాగంగా ఖాతాలు తీయించాలని అధికారులను ఆదేశించింది. ఫలితంగా ఏళ్లుగా పోస్టాఫిస్‌ల ద్వారా జరిగే బిల్లుల చెల్లింపు విధానానికి స్వస్తి పలకనుంది. ఈ నూతన విధానంతో ఎలాంటి అక్రమాలు చోటు చేసుకోకుండా నేరుగా త్వరగా కూలీల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని ప్రభుత్వం యోచిస్తుంది.

ఉపాధి కూలీల వివరాల సేకరణ..

ఈ నూతన విధానంలో కూలీల బ్యాంకు ఖాతాలు, ఉపాధిహామీ కార్డు, సెల్ నెంబర్‌లను తీసుకొని వాటిని ఆధార్‌తో అనుసంధానం చేయనున్నారు. గ్రామాల్లో శిబిరాలను ఏర్పాటు చేసి వివరాలన్నీ సేకరించనున్నారు. క్షేత్రసహాయకులకు ఈ పనిని అప్పగించి త్వరితగతిన పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది

నూతన విధానంతో ఆందోళన..

పోస్టాఫిస్‌లలో నగదు కొరత కారణంగా బిల్లులు సకాలంలో అందట్లేదు. కూలీలు రోజు తీరుగుతున్నా ఫలితం లేకపోతుంది. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు పోస్టాఫిస్‌ల ద్వారా చెల్లించాల్సిన మొత్తం రూ.250 కోట్ల పెండింగ్‌లో ఉన్నట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. బ్యాంకుల ద్వారా చెల్లింపులు జరిపితే ఎలాంటి ఇబ్బందులు ఉండవని ప్రభుత్వం భావిస్తుంది. ఈ విధానం మాత్రం కూలీలకు ఇబ్బందులను తెచ్చి పెడుతుందని పలువురు చెబుతున్నారు. సొంత గ్రామాల్లోనే పోస్టాఫిస్‌లు ఉండటంతో ఏ సమయంలోనైనా డబ్బులు తీసుకునే వీలు ఉంటుంది. బ్యాంకుల ద్వారా ఇస్తే కచ్చితంగా మండల కేంద్రాలకు వెళ్లాల్సి ఉంటుంది. దీని కోసం ఓ రోజు కేటాయించాల్సి ఉంటుంది. గ్రామీణ ప్రాంతాలకు బస్సు సౌకర్యం లేని పక్షంలో ప్రత్యేకంగా ప్రైవేట్ వాహనాల్లో వెళ్లాల్సి ఉంటుంది. దీంతో అదనపు భారం పడే అవకాశం ఉందని వాపోతున్నారు.

జిల్లాలో ఉపాధి పనులు...

18 మండలాల పరిధిలోని 367 గ్రామాల్లో ఉపాధి హామీ పనులు కొనసాగుతున్నాయి. శ్రమశక్తి సంఘాలు ఉండగా అందులో 4.266 లక్షల మంది ఉపాధి కూలీ పని చేస్తున్నారు. ప్రస్తుతం హరిత హారం మూడో విడత జోరుగా కొనసాగుతుండటంతో ఉపాధిహామీ అధికారులు ఆ పనిలో నిమగ్నమయ్యారు. ఈ కార్యక్రమం ముగింపు దశకు చేరుకున్న తర్వాత ప్రభుత్వం సూచించిన విధంగా ఉపాధి కూలీల ఆధార్ అనుసంధాన ప్రక్రియను ప్రారంభిస్తామని అధికారులు చెబుతున్నారు. త్వరలోనే ప్రక్రియ ప్రారంభమై బ్యాంకుల ద్వారా కూలీ డబ్బులు పొందేందుకు సులభతరం కానుంది. కానీ కూలీ పనులు చేసిన గ్రామాల్లో పోస్టాఫిస్‌లు ఉండటంతో కూలీ డబ్బులు పొందేందుకు వెసులుబాటు ఉండేదని పలువురు అభిప్రాయపడగా మరి కొందరూ బ్యాంకుల ద్వారానే సకాలంలో డబ్బులు చేతికి అందుతాయని చెబుతున్నారు. బయోమెట్రిక్ విధానంతో కూలీ డబ్బుల పంపిణీ ఆలస్యం జరగడంతో రోజుల తరబడి తిరగాల్సిన పరిస్థితి నెలకొంటుంది.

డబ్బులు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలి



ఉపాధి పనులు చేపట్టిన కూలీలకు సకాలంలో డబ్బులు చెల్లించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి. పనులు చేపట్టిన పది రోజుల వ్యవధిలోనే కూలీ డబ్బులను చెల్లిస్తే బాగుంటుంది. పలు సాంకేతిక కారణాలతో సకాలంలో కూలీ డబ్బులు అందక ఇబ్బందులు తప్పడం లేదు. బ్యాంకు ద్వారా డబ్బులు చెల్లించడం బాగుంటుంది.

వెంకటయ్య, ఫీల్డ్ అసిస్టెంట్, ఎరన్‌పల్లి

హరితహారం పూర్తయ్యాక కొనసాగిస్తాం..



హరితహారం కార్యక్రమంలో క్షేత్ర సహాయకులు, మిగతా సిబ్బంది నిమగ్నమై ఉన్నారు. కార్యక్రమం పూర్తయిన తర్వాత ఉపాధి కూలీల ఆధార్, బ్యాంకు ఖాతా అనుసంధాన ప్రక్రియను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం. బ్యాంకుల ద్వారా చెల్లింపు సులభతరంగా ఉంటుందని ప్రభుత్వం భావిస్తుంది. ప్రభుత్వ ఆదేశాలను త్వరలోనే అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

వీరబ్రహ్మాచారి, ఎంపీడీవో, కొడంగల్

కొండెక్కిన ఉల్లి



పరిగి: ఉల్లి కన్నీళ్లు తెప్పిస్తోంది. ఆకాశన్నంటిన ఉల్లిగడ్డల ధరలతో ప్రజలను చుక్కలను చూపిస్తోంది. ఉల్లి ధర కిలో నిన్నమొన్నటి వరకు రూ.5 నుంచి రూ.10ల వరకు ధరలు ఒక్కసారి అకాశన్నంటడంతో తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలోని మార్కెట్‌లలో రూ.40 నుంచి రూ.50ల కిలో పలుకుతున్నది. గత రెండు, మూడు రోజుల నుంచి జిల్లాలోని పరిగి,వికారాబాద్, తాండూరు, కొడంగల్ మార్కెట్లలో ఉల్లిధరలు ఉల్లిధరలు రోజు,రోజుకు పెరిగిపోతున్నది. ఇలా ఎడా,పెడా పెరిగిన కూరగాయల ధరలతో శ్రావణ మాసం ఆసాంతం కూరగాయలు కొనలేక కడుపు నిండా తినలేకపోయామని వాపోతున్నారు. కిలో టమాట, మిర్చి రూ.100ల నుంచి ఇప్పుడిప్పుడే ధరలు తగ్గి రూ.50లకు చేరిందని ఆశ పడిన కొనుగోలు దారులకు ఉల్లిగడ్డ ధర పెరిగి పోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కిలో ఉల్లిగడ్డలు కొనుగోలు చేస్తే కనీసం వారం రోజులు వచ్చే పరిస్థితి లేదని వాపోతున్నారు. ఇలా అయితే సామాన్యుడు వంటలు చేసుకునేదెలా అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిగి మార్కెట్‌లో కిలో ఉల్లి రూ.50లు,పచ్చిమిర్చికి రూ.60 పలికింది. రోజు,రోజకు పెగుతున్న ఉల్లి ధరలను చూసి వ్యాపారస్తులు కూడా కృత్రిమ కొరతను సృష్టిస్తున్నట్లు తెలుస్తోంది. జూన్‌లో కిలో రూ.5 నుంచి రూ.10లలోపే ఉన్న ఉల్లి రెండు నెలల్లోనే ఆరింతలు రెటు పెరిగింది. ఉల్లిని పండించిన రైతులు అమ్ముకున్నప్పుడు క్వింటాలు రూ.500 నుంచి రూ.1000లకే అమ్ముకున్నారు. ఇప్పుడంతా దళారులు,వ్యాపారుల చేతుల్లోకి వెళ్ళిపోయిన తర్వాత క్వింటులకు రూ.4000 నుంచి రూ.5000ల వరకు పలుకుతున్నది. అదే చిల్లర అయితే కిలో రూ.50లకు పైగా చేరుకుంది. వ్యాపారులకు మాత్రం ఉల్లి కాసులపంట పండిస్తున్నది. రైతుల నుంచి నేరుగా కొనుగోలు చేసి ప్రజలకు సరఫరా చేయాల్సిన ప్రభుత్వ వైఫల్యంతో ఉల్లిధరలు తారాస్థాయికి చేరకుంటున్నాయని రైతులు వాపోతున్నారు. ధరలను ప్రభుత్వం నియంత్రించిన కారణంగా సామాన్యుడి జేబు గుల్లవుతోంది. పెరుగుతున్న ధరలను ముందే పసిగట్టిన వ్యాపారులు నిల్వలు ఉంచుకుని కృత్రిమ కొరతలను సృష్టిస్తున్నారు. ఈ కారణంగా మార్కెట్‌లో త్వరంలో కిలో ఉల్లి రూ.100కు చేరుకునే అవకాశాలు ఉంటాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మిగతా వాటి ధరలు పైపైకే..

జిల్లాలోని మార్కెట్లలో ఉల్లితోపాటే కూరగాయల ధరలు కూడా భగ్గుమంటున్నాయి. పెరుగుతున్న కూరగాయల ధరలతో పేద ప్రజలకు భారంగా పరిణమిస్తున్నదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.నిత్యం అవసమయ్యే కూరగాయల ధరలు నేడు చుక్కలనట్టడంతో సామాన్య మధ్యతరగతి కుటుంబాలు బావురుమంటున్నాయి. ఏ వస్తువుకైనా నిన్న ఉన్న ధరలు నేడు లేవు..నేటి ధరలు రేపు ఉండకపోవడంతో వారు తీవ్ర అందోళన వ్యక్తం చేస్తున్నారు. ముందేన్నడు లేని విధంగా కూరగాయల ధరలు అసాధారణ రీతిలో పెరగడంతో జీవనం కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు నెలల క్రితం రూ.40ల కిలో ఉన్న పచ్చిమిర్చి ఇప్పుడు రూ.60 నుంచి రూ.70లకు చేరుకుంది. పరిగి మార్కెట్‌లో గత రెండు వారాల క్రితం కిలో మిరపకాయలు రూ.100లకుపైగా పలికిన సంగతి విధితమే. ప్రస్తుతం కొంత తగ్గిన అది కూడా అది కూడా రూ.60లపైమాటే ఉండడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెండు నెలల క్రితం రూ.30లు ఉన్న బీరకాలు ఇప్పుడు రూ.60లకు చేరుకుంది. బెండకాయ కిలోధర రూ.30 ఉండడా, ఇప్పుడు రూ.40లు, ఆలుగడ్డ రూ.15 ఉంటే ఇప్పుడు రూ.30లు, దొండకాయ రూ.30లు ఉంటే ఇప్పుడు రూ.40లు, వంకాయలు కిలో రూ.30లు రూ.50లకు చేరుకుంది. పరిగి మార్కెట్‌లో ఏ కూరగాయలను చూసిన రూ.50లపైనే ఉంటుంది. దీంతో సామాన్య మధ్య తరగతి వారు కూరగాయలు కొనుగోలు చేయలేక బెంబెలెత్తుతున్నారు. ధరలను నియంత్రించాలని పేద,మధ్య తరగతి కుటుంబాలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి.

నిమజ్జనోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు

పరిశీలించిన సైబరాబాద్ కమిషనర్ సందీప్ శాండిల్యా



లక్ష్మీనారాయణ చెరువును సందర్శించిన సైబరాబాద్ సీపీ సందీప్ శాండీల్య

ఘట్‌కేసర్ రూరల్: వినాయక నిమజ్జన ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించాలని, భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ సందీప్ శాండీల్య అధికారులను ఆదేశించారు. మండల పరిధిలోని ఏదులాబాద్‌లో గల లక్ష్మీనారాయణ చెరువు వద్ద వినాయక నిమజ్జన ఏర్పాట్లను బుధవారం ఆయన పరిశీలించారు. ప్రతియేటా చెరువులో ఎన్ని వినాయకులు నిమజ్జనం చేశారు, ఏ ఏ రోజులలో ఎన్ని వినాయకుల నిమజ్జనం చేస్తారు అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. వినాయకులును తీసుకుచ్చే వాహనాలు ఎక్కడి నుంచి వెళ్తతాయి, కట్టపై వాహనాలు మలుపు ఏలా తిరిగుతాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. వినాయక నిమజ్జన ఏర్పాట్లలో జాప్యం చేయకుండా త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. క్రేను ఎప్పుడుగా ఎక్కువగా అవసరం ఉంటుందని స్థానిక సర్పంచ్ బట్టె శంకర్ ను అడిగారు. 5, 7, 9, 11 రోజులలో వినాయక నిమజ్జనం అధిక సంఖ్యాలో జరుగుతాయని సీపీకి తెలిపారు. కార్యక్రమంలో రాచకొండ కమిషనరేట్ జాయింట్ కమిషనర్ తరుణ్ జోషి. మల్కాజ్‌గిరి డివిజన్ డీసీపీ ఉమమహేశ్వర శర్మ, మల్కాజ్‌గిరి ఏసీపీ జి. సందీప్, సీఐ ప్రకాష్, తహసీల్దారు రాజేశ్వర్‌రెడ్డి, ఇరిగేషన్ ఏఈ నివేదిత, అర్ఐ కృష్ణచైతన్య, ఎంపీటీసీ సభ్యుడు మంకం రవి, కార్యదర్శి నరసింహరావు, వీఆర్వో నరేందర్‌రెడ్డి, వార్డుసభ్యులు ఎం.కె కొండమ్మ, ఎర్రోళ్ల మురళి, బింగి యుగేందర్‌గౌడ్, నాయకులు సింగారం సుక్కయ్య, నడిమింటి వెంకటేష్, అబ్బోల్ల నాగేష్, ఈగల మల్లేష్, బింగి రాజేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

కీసర : వినాయక చవితి నవరాత్రుల్లో భాగంగా జరిగే నిమజ్జన ఏర్పాట్లను సైబరాబాద్ పోలీస్ కమీషనర్ సందీప్ శాండిల్యా మండల పరిధిలోని రాంపల్లి పాత చెరువును బుధవారం పరిశీలించారు. ఈ మేరకు చెరువు వద్దకు వినాయక విగ్రహాలతో వచ్చే వాహనాలకు అనుకూలంగా మట్టిని చదును చేసేందుకు స్థానిక ప్రజాప్రతినిధులు సహకరించాలని ఆయన ఆదేశించారు. అదే విధంగా నవరాత్రులు చెరవు వద్ద విద్యుత్ దీపాలు అమర్చాలని, నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించే అధికారులకు గ్రామపంచాయతీ అధికారులు, పాలకులు సహకరించాలని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు. అదే విధంగా చెరవు వద్ద ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగిన బందోబస్తు ఏర్పాట్లు చేయాలని, చెరువు వద్ద వచ్చే మార్గాలల్లో ఎలాంటి రోడ్డు ప్రమాదాలు జరగకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో అల్వాల్ ఏసీపీ రఫీక్, సీఐ సురేందర్ గౌడ్, తహసీల్దార్ వెంకట ఉపేందర్‌రెడ్డి, సర్పంచ్ జ్యోతి పాల్గొన్నారు.

'మధ్యాహ్న' భోజనాన్ని

పరిశీలించిన కేంద్ర బృందం

ఘట్‌కేసర్: ప్రభుత్వ పాఠశాలలో అమలౌతున్న మధ్యాహ్న భోజనపథకాన్ని కేంద్ర మానవ వనరుల అభివృద్ధి సంస్థ బృందం పర్యటించి నిత్యవసర సరుకులను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బుధవారం ఘట్‌కేసర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలను కేంద్ర మానవ వనరుల అభివృద్ది సంస్థ ఆధ్వర్యంలో కేంద్ర సీనియర్ కన్సల్‌టెంట్ రూపేన్, రాష్ట్ర ప్రాథమిక విద్యాశాఖ కమీషనరేట్ సూఫరిన్‌డెంట్ ప్రసాద్, సహాయ సంచాలకులు గోవర్దనల బృందం మధ్యాహ్న భోజనం అమలు జరుగు తున్న తీరు ఉపయోగిస్తున్న బియ్య, పప్పుదినుసులు, కూరగాయాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజనా న్ని తినకపోవడాన్ని గుర్తించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోజువారి మోనూపై అరా తీశారు. నిత్యం మధ్యాహ్న భోజనానికి వంటగ్యాస్‌ను ఉపయోగిస్తున్నారా, కట్టెల పోయ్యిపై వండ్డుతున్నారా అనే విషయా లపై మధ్యాహ్న భోజన నిర్వహకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను సైతం పరిశీలించారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులతో సమావేశమై మధ్యాహ్న భోజన పథకంపై చర్చించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి నర్సింహరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు రావూఫ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు కార్పొరేట్ హంగు

- ఇక నుంచి అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ పేరెంట్ - టీచర్ మీటింగ్
- ప్రతి నెలా 9వ తేదీన సమావేశం
- నెలవారీగా ప్రోగ్రెస్‌కార్డులు
- విద్యార్థుల ప్రతిభ ఆధారంగా మార్కులు
- ప్రైవేట్ మాదిరిగానే నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ అందించే దిశగా అడుగులు
- ఆంగ్లంలో ప్రీప్రైమరీకి విద్యకు శ్రీకారం

(ఆంధ్రజ్యోతి, మేడ్చల్‌జిల్లా ప్రతినిధి)

ప్రాథమిక విద్యను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ప్రైవేట్ పాఠశాలల పోటీలను తట్టుకుని నిలిచేందుకు ప్రీప్రైమరీ తరగతులను ప్రభుత్వ పాఠశాలల్లో ప్రారంభించే చర్యలకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలను ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు అనుసంధానం చేయాలని నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు తగిన చర్యలు చేపట్టింది. జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎన్నింటిని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లోకి అనుసంధానంపై సర్వేను చేపట్టి, జిల్లాలో 139 అంగన్‌వాడీ కేంద్రాలను ప్రభుత్వ పాఠశాలలకు అనుసంధానం చేయాలని గుర్తించారు. ఇప్పటివరకు 15కేంద్రాలను పాఠశాలల్లో విలీనం చేశారు. జిల్లాలో మూడు ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. వీటి పరిధిలో 793 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఈ కేంద్రాల్లో 6నుంచి3 సంత్సరాలలోపు చిన్నారులు 64,574మంది, 3నుంచి6 సంవత్సరాల లోపు పిల్లలు 37,944మంది, గర్భిణులు 8,700మంది, బాలింతలు 9839మంది వరకు ఉన్నారు. ఇకనుంచి



ప్రైవేట్ పాఠశాలల మాదిరిగానే నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ అందించే దిశగా అడుగులు వేస్తోంది. జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుతోన్న చిన్నారుల నైపుణ్యాన్ని వెలికితీసేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నారు. పిల్లల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుంది. ప్రైవేట్ పాఠశాలల మాదిరిగానే అంగన్‌వాడీ కేంద్రాల్లో (పేరెంట్ టీచర్ మీటింగ్) తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించనున్నారు. ప్రతినెలా విద్యార్థుల ప్రతిభ ఆధారంగా వారికి ప్రొగ్రెస్ (మార్కులజాబితా) కార్డులను అందించనున్నారు. ప్రధానంగా చిన్నారుల చదువుతో పాటు ఆటలు, పాటలు అవగాహన, పరిశుభ్రత, నైపుణ్యాన్ని గుర్తించి మార్కులు వేయనున్నారు. పిల్లలకు ఎదుగుదలకు సంబంధించి పలు సూచనలు కూడా చేయనున్నారు. ఏ యే చిన్నారి చురుగ్గా, ఉత్సాహంగా ఉన్నారు. వెనుకబడిన విద్యార్థుల వివరాలను వెల్లడించనున్నారు. ఇకనుంచి చిన్నారుల తల్లిదండ్రులతో నెలకోసారి ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటుచేయనున్నారు. ప్రతి నెల 9వ తేదీనా అన్ని కేంద్రాల్లోనూ సమావేశాలు నిర్వహించేందుకు మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ప్రతినెల నిర్వహిస్తున్న సమావేశాలతో తల్లిదండ్రులు చిన్నారుల్లో నైపుణ్యాన్ని పెంపొందించేందుకు అవకాశం ఉంటుంది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆంగ్లంలో బోధించేందుకు చర్యలు

చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఆటపాటలతోపాటు ప్రీ ప్రైమరీ విద్యను అందజేస్తున్నారు. మధ్యాహ్నం అల్పాహారం కింద స్నాక్స్ ఇస్తున్నారు, గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య లక్ష్మీ పథకం కింద మధ్యాహ్న భోజనంలో గుడ్లు, పప్పు, కూరగాయలు పెడుతున్నారు. అంతేకాకుండా 200మిల్లీలీటర్ల పాలు అందిస్తున్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన కేజీ టూ పీజీ అమలులో భాగంగా ప్రీప్రైమరీ నుంచే ఇంగ్లీష్ మీడియాన్ని బోధించేందుకు చర్యలు తీసుకుంటుంది. అంగన్‌వాడీ కేంద్రాలను ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు అనుసంధానం చేయడంతో, ప్రతి సంవత్సరం పడిపోతున్న విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచేందుకు ఉపయోగపడుతుంది.



ప్రతినెలా సమావేశాలు

ప్రభుత్వ ఆదేశాల మేరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రతి నెలా చిన్నారుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహిస్తున్నాం. విద్యార్థుల ప్రతిభ ఆధారంగా మార్కులను రూపొందించనున్నాం. అన్ని కేంద్రాలను ప్రాథమిక పాఠశాలలకు అనుసంధానం చేసే విషయంపై అధ్యయనం చేస్తున్నాం. జిల్లాలో ఇప్పటివరకు 15 అంగన్‌వాడీ కేంద్రాలను విలీనం చేశాం.

- మహిళా,శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ అధికారి స్వరూపరాణి

పోస్టుల భర్తీపై కసరత్తు

- జిల్లాకు కొత్తగా 17పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మంజూరు
- కాంట్రాక్టు పద్ధతిన వైద్యులు, సిబ్బంది నియమాకాలు
- 255మంది పోస్టులకు దాదాపు 2వేల మంది దరఖాస్తులు
- మెరిట్ జాబితాపై వైద్యశాఖ కసరత్తు
- రెండువారాల్లోగా నియమాక ప్రక్రియ పూర్తి చేసేందుకు చర్యలు

(ఆంధ్రజ్యోతి, మేడ్చల్‌జిల్లా ప్రతినిధి)

జిల్లాలో జనాభాకు తగ్గట్టుగా ప్రభుత్వ ఆస్పత్రులు లేవు. ఈ మేరకు జిల్లాయంత్రాంగం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. నగరశివారు ప్రాంతాల్లో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు(యూపీహెచ్‌సీ) ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. మేడ్చల్-మల్కాజ్‌గిరిజిల్లాలో కొత్తగా 17యూపీహెచ్‌సీ ఆస్పత్రులు మంజూరయ్యాయి. వీటిని వీలైనంత త్వరగా ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో జిల్లాయంత్రాంగం ఆస్పత్రులకు భవవాల సేకరణ, వైద్యులు, సిబ్బంది నియామకాలపై కసరత్తు ప్రారంభించింది. మెడికల్ ఆఫీసర్స్ ఫుల్, పార్ట్‌టైం, స్టాఫ్ నర్సులు, ఫార్మాసిస్టులు, ల్యాబ్‌టెక్నీషియన్లు గ్రేడ్-2, అకౌంటెంట్లు, ఏఎన్ఎంలు, సపోర్టింగ్ స్టాఫ్‌ను కాంట్రాక్టు పద్ధతిన నియమించేందుకు జూన్‌లో నోటీఫికేషన్ జారీచేసింది. జిల్లాలో 17యూపీహెచ్‌సీలకు మొత్తం మొత్తం 255 పోస్టులు మంజూరయ్యాయి. ఒక సంవత్సరం కాంట్రాక్టు పద్ధతిన నియమించి, వారి పనితీరును బట్టి సర్వీసును రిన్యూవల్ చేయనున్నారు. వీటిలో సపోర్టింగ్ స్టాఫ్‌ను ఔట్‌సోర్సింగ్ ద్వారా నియమించనున్నారు. నియమాకాలు నేషనల్‌అర్బన్ హెల్త్ మిషన్ కింద చేపట్టనున్నారు. జిల్లాలో 17మంది ఫుల్‌టైం, 17మంది పార్ట్‌టైం వైద్యుల నియమించనున్నారు. అదేవిధంగా స్టాఫ్‌నర్సులు 34పోస్టులు, ఫార్మాసిస్టులు 17, ల్యాబ్‌టెక్నీషియన్లు గ్రేడ్-2 పోస్టులు 17, అకౌంటెంట్లు 17, ఏఎన్ఎంలు 85, సపోర్టింగ్ 51పోస్టులు భర్తీ చేయనున్నారు. జూలై 22వ తేదీవరకు గడువు విధించి పోస్టుల భర్తీ కోసం దరఖాస్తులను స్వీకరించారు. అభ్యర్థులను మార్కుల మెరిట్ ఆధారంగా నియమాకాలు చేపట్టనున్నారు. ఈ మేరకు వైద్యఆరోగ్యశాఖ అధికారులు కసరత్తు పూర్తి చేస్తున్నారు. 255 పోస్టులకు గానూ దాదాపు రెండువేల వరకు దరఖాస్తులు అందాయి. వీటన్నింటినీ పరిశీలించి, మెరిట్ ఆధారంగా జాబితాను రూపొందిస్తున్నారు. రెండురోజుల్లోగా మెరిట్ జాబితాను రూపొందించి, ఎంపిక ప్రక్రియను చేపట్టనున్నారు. ఈ మేరకు కార్యాచరణను రూపొందిస్తున్నారు. రెండువారాల్లోగా పోస్టుల భర్తీతో పాటు ఆస్పత్రి భవనాల ఎంపిక వంటివి పూర్తి చేసేందుకు వైద్యఆరోగ్యశాఖ అధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో ప్రస్తుతం 18ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు(పీహెచ్‌సీ)ఉన్నాయి. వీటిలో 24గంటలు పనిచేసే 11పీహెచ్‌సీలతోపాటు 7అర్బన్‌హెల్త్ సెంటర్లు ,ఒకటి కమ్యూనిటీ హెల్త్‌సెంటర్, మరొకటి ఏరియా ఆస్పత్రి ఉంది. అదేవిధంగా జిల్లావ్యాప్తంగా పట్టణ, గ్రామీణప్రాంతాల్లో 97సబ్‌సెంటర్లు ఉన్నాయి. జిల్లాలో 15వరకు 108 సర్వీసులు ఉన్నాయి. అదేవిధంగా జిల్లాలో రెండు 104 సర్వీసులు ఉన్నాయి. ప్రభుత్వం ఆదనంగా 17కొత్త పీహెచ్‌సీలను మంజూరుచేసినప్పటికీ సరిపోని పరిస్థితి. కొత్తగా మరో 17యూపీహెచ్‌సీలు మంజూరు కానుండటంతో పేదప్రజలకు ఎంతో మేలు జరుగనుంది.

ఓటరు జాబితా సవరణను

వేగవంతం చేయాలి

కలెక్టర్ ఎంవీ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

కీసర రూరల్ : ఓటరు జాబితా సవరణను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.వి.రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఓటర్ల జాబితా పరిశీలకులు విష్ణుతో కలిసి రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఈఆర్‌వోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జీహెచ్ఎంసీ పరిధిలోని కుత్బుల్లాపూర్, ఉప్పల్, కూకట్‌పల్లి, మల్కాజ్‌గిరి నియోజకవర్గాల్లో ఓటర్ల జాబితా సవరణలను చేపట్టడం జరుగుతుందన్నారు. ఒకే ప్రాంతం, ఒకే ఇంటిలోని వారు వేర్వేరు పోలింగ్‌స్టేషన్‌లకు వెళ్లడం జరుగుతుందని తెలిపారు. దీనిని నివారించేందుకు ఇంటింటికి వెళ్లి ఓటర్ల జాబితా సవరణలను చేపట్టడం జరుగుతుందన్నారు. సవరణల వివరాలను ట్యాబ్‌ల ద్వారా ఆన్‌లైన్ చేయడం జరుగుతుందని వివరించారు. జిల్లాలో ఓటర్లు ఎక్కువ మొత్తంలో ఉన్నందున సవరణల ప్రక్రియను వేగవంతం చేయాలని ఈఆర్‌ఓలకు సూచించారు. నియోజకవర్గ స్థాయిలో వచ్చే మూడు రోజుల్లో వివిధ రాజకీయ పార్టీలతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆ అంశంపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో రెండు రఫాలుగా సమావేశాలు నిర్వహించి వారి సలహాలు, సూచనలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఓటర్ల జాబితా పరిశీలకులు విష్ణు మాట్లాడుతూ జీహెచ్ఎంసీ పరిధిలోని నియోజక వర్గాల్లో ఈ ప్రక్రియను ప్రారంభించడం జరిగిందని తెలిపారు. సవరణలకు తప్పకుండా ఇంటింటికి వెళ్లి పరిశీలించి, జియోట్యాగింగ్ ప్రక్రియను పూర్తి చేయడం జరుగుతుందన్నారు. సమావేశంలో డీఆర్‌వో సురేందర్ రావు, డిప్యూటీ మున్సిపల్ కమిషనర్‌లు, తహసీల్దార్‌లు, ఎన్నికల తహసీల్దార్ రాజేశ్వరి, రాజకీయ పార్టీల ప్రతినిధులు కుమార్, సహదేవ్ పాల్గొన్నారు.

ఆ పనులు మాకొద్దు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

- ఉపాధి హామీ పనులపై కాంట్రాక్టర్లు అనాసక్తి
- మరింత భారమైన ఇసుక, సిమెంట్ ధరలు
- ఇనుము, సిమెంట్‌కు జీఎస్టీ పోటు

ప్రభుత్వ నిర్మాణ పనులను దక్కించుకునేందుకు ఆరాటపడే కాంట్రాక్టర్లు ఉపాధి హామీ పనులంటే మాకొద్దు బాబోయ్ అని భయపడి పారిపోతున్నారు. లాభం ఏమో కానీ ఖర్చుపెట్టిన డబ్బు చేతికి అందే అవకాశం లేకపోవడంతో ఉపాధి పనులపై ఆసక్తి చూపడం లేదు. దీంతో ఉపాధి హామీ పథకం కింద చేపట్టే నిర్మాణ పనులపై తీవ్ర ప్రభావం పడుతోంది. కొత్త పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. ఈ పనులు తమకు అసలు గిట్టుబాటు కావడం లేదని చెబుతున్నారు. గ్రామీణ ప్రాంతాలలో ఉండే వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పించేందుకు కేంద్రం జాతీయ ఉపాధి హామీ పథకం అమలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ పథకం కింద గతంలో కేవలం కూలీలకు ఉపాధి కల్పించే వ్యవసాయ పనులు చేపట్టే వారు. అయితే కొన్ని ప్రాంతాల్లో కరువు పరిస్థితులు దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం వివిధ పథకాల కింద చేపట్టే నిర్మాణ పనులకూ ఈ పథకాన్ని వర్తింపచేయాలని నిర్ణయించారు. ఈ మేరకు గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, స్కూళ్లు, అంగన్‌వాడీ, సామూహిక భవనాల నిర్మాణాలు, చెక్‌డ్యామ్‌ల నిర్మాణాలు ఈ పథకం పరిధిలోకి తెచ్చారు. కేంద్రం కేటాయించే పనులకు మ్యాచింగ్ గ్రాంటు ఉంటే జాతీయ ఉపాధి హామీ పథకం కింద ఎన్ని పనులైనా చేసుకునే వెసులుబాటు ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం జాతీయ ఉపాధి హామీ పనులు సర్పంచ్‌ల ఆధ్వర్యంలోనే జరగాలి. కాంట్రాక్టర్లను ఎంపికచేసి పంచాయతీ తీర్మానాలు ఆధారంగా పనులు కేటాయిస్తారు. లోపాయికారీగా వీటికి సర్పంచ్‌లు కమీషన్లు కూడా పుచ్చుకుంటారు. కమీషన్లతో పాటు పెరిగిన నిర్మాణ వ్యయం భరించలేక కాంట్రాక్టర్లు ఈ పనుల జోలికి రావడం లేదు. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం జాతీయ ఉపాధి హామీ పనులు సర్పంచ్‌ల ఆధ్వర్యంలోనే జరగాలి. కాంట్రాక్టర్లను ఎంపిక చేసి పంచాయతీ తీర్మానాలు ఆధారంగా పనులు కేటాయిస్తారు. లోపాయికారీగా వీటికి సర్పంచ్‌లు కమీషన్లు పుచ్చుకుంటారు. కమీషన్లతో పాటు పెరిగిన నిర్మాణ వ్యయం భరించలేక కాంట్రాక్టర్లు చేతులెత్తేస్తున్నారు. ఈ పథకం కింద జిల్లాలో ప్రతి ఏటా వందల కోట్ల అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ఇందులో ఈ ఏడాది రూ. 40 కోట్లతో పలు ప్రాంతాల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణాలు చేపట్టారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో ఈ పనులు చేపడుతున్నారు. దాదాపు ఇంతే సమానంగా భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేశారు. కానీ ఈ పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు పలుచోట్ల ముందుకు రావడం లేదు. దీనికి ప్రధానంగా మూడు కారణాలు ఉన్నాయి. జిల్లాలో ఇసుక కొరత అధికంగా ఉంది. ఇసుక ఎక్కడా దొరకడం లేదు. అధిక రేటు చెల్లించి ఇతర ప్రాంతాలనుంచి కొనుగోలు చేయాల్సి వస్తుంది. కాంట్రాక్టర్లకు ప్రభుత్వం ఇసుకకు టన్నుకు రూ. 1000 నుంచి రూ. 1200 వరకే ధర చెల్లిస్తుంది. కానీ ఈ ధరకు ఎక్కడా ఇసుక దొరకడం లేదు. టన్నుకు ఇసును రూ. 1500లకుపైగా చెల్లించి కొనుగోలు చేస్తున్నామని కాంట్రాక్టర్లు వాపోతున్నారు. లక్ష రూపాయల ఉపాధి పనులకు మూడువేల రూపాయలు అదనంగా ఖర్చు వస్తుందని చెబుతున్నారు. అలాగే సిమెంట్ విషయంలోనూ కాంట్రాక్టర్లు ఇబ్బందులు పడుతున్నారు. సిమెంట్ బస్తాకు ప్రభుత్వం రూ. 230 చెల్లిస్తోంది. కానీ ఈ ధరకు సిమెంట్ ఎక్కడా దొరకడం లేదు. ప్రస్తుతం సిమెంట్ ధర రూ. 280లపైనే ఉంది. పెరిగిన ఇసుక, సిమెంట్ ధరలకు తోడుగా ఇపుడు జీఎస్టీ భారం కాంట్రాక్టర్లను వేధిస్తోంది. సిమెంట్, స్టీల్, ఇతర నిర్మాణ సామాగ్రి కొనుగోళ్లపై 18శాతం జీఎస్టీ భారం పడుతుందని కాంట్రాక్టర్లు చెబుతున్నారు. ప్రభుత్వ పనులకు జీఎస్టీ మినహాయించాలని వారు కోరుతున్నారు.

బిల్లుల చెల్లింపులో ఆలస్యం...

ఇదిలా ఉంటే ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులకు సంబంధించి కాంట్రాక్టర్లకు బిల్లులు కూడా సక్రమంగా చెల్లించడం లేదు. గత మార్చి నెల నుంచి బిల్లులు రాలేదని కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లాభాలు లేకున్నా అనేకచోట్ల ఈ పనులు చేపట్టామనీ, కానీ వీటికీ బిల్లులు ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. ఈ కారణంగా అనేక చోట్ల పనులు ముందుకు సాగడం లేదు. కొందరైతే బాధలు పడలేక ఈ పనుల నుంచి ఎప్పుడు బయట పడదామా? అని ఎదురుచూస్తున్నారు. ఉపాధి పనులు చేపట్టే కాంట్రాక్టర్లకు పని పూర్తిచేసినా బిల్లులు పూర్తిగా చెల్లించరు. సోషల్ ఆడిట్ పూర్తయితేనే బిల్లు మొత్తం చెల్లిస్తారు. సోషల్ ఆడిట్ పూర్తయ్యే వరకు అయిదు శాతం బిల్లులు చెల్లించకుండా ఆపుతారు. సోషల్ ఆడిట్ పూర్తయ్యేందుకు ఏడాదికిపైగా పడుతోంది. అప్పటివరకు కంట్రాక్టర్లు డబ్బు కోసం ఎదురు చూడాల్సి వస్తోంది. సాధారణంగా పంచాయతీరాజ్ చేపట్టే పనులకు అంచనా విలువ లెక్కించి దాని మీద కాంట్రాక్టర్‌కు 12.5 శాతం లాభం ఉండేలా ఎస్టిమేట్ తయారుచేస్తారు. కానీ గ్రామీణాభివృద్ధి పనుల్లో లాభాలు లేకుండానే ఎస్టిమేట్లు తయారుచేయాలి. నిర్మాణ వ్యయం పెరగడంతోపాటు సర్పంచ్‌లకు కొంత కమీషన్ల రూపంలో చెల్లించుకోవాల్సి ఉండడంతో కాంట్రాక్టర్లకు పెట్టిన పెట్టుబడి కూడా చేతికి వచ్చే పరిస్థితి లేదు.



లక్ష్మీనారాయణను సన్మానిస్తున్న బికుమాండ్ల యాదయ్య, జడ్పీటీసీ కండె హరిప్రసాద్ తదితరులు

పేద ఆర్యవైశ్యులకు ప్రభుత్వం చేయూతనివ్వాలి

ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనారాయణ

ఆమనగల్లు : హక్కుల సాధన, సమస్యల పరిష్కారానికి ఆర్య వైశ్యులు ఐక్యంగా ముందుకు సాగాలని ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. కులవృత్తులకు చేయూతనందిస్తున్న మాదిరిగా ప్రభుత్వం పేద ఆర్య వైశ్యులకు చేయూతనందించి ఆదుకోవాలని ఆయన కోరారు. ఆమనగల్లు పట్టణంలోని కన్యకాపరమేశ్వరి దేవాలయాన్ని బుధవారం లక్ష్మీనారాయణ సందర్శించారు. ఆలయంలో వాసవీ మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు బికుమాండ్ల యాదయ్య, జడ్పీటీసీ కండె హరిప్రసాద్ ఆధ్వర్యంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు లక్ష్మీనారాయణ, రాష్ట్ర మహాసభ నేతలకు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. స్థానిక ఆర్యవైశ్యుల స్థితిగతుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం లక్ష్మీనారాయణ మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీలు ఆర్యవైశ్యులకు తగిన అవకాశాలు కల్పించాలన్నారు. ప్రభుత్వ పథకాలలో పేద ఆర్యవైశ్యులకు పెద్ద పీట వేయాలని కోరారు. కళ్యాణ లక్ష్మీ ఆర్యవైశ్యులకూ వర్తింపజేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహసభ రాష్ట్ర నాయకులు శ్యామ్, గణేశ్, లక్ష్మయ్య, వాసవీ క్లబ్ మాజీ గవర్నర్ జూలూరి రమేశ్ బాబు, స్థానిక నాయకులు నటరాజ్ యాదయ్య, పాపిశెట్టి రాము, జూలూరి రవీంద్రానంద్, మేడిశెట్టి శ్రీధర్, కండె కళావతి, వీరబొమ్మ రామ్మోహన్, డాక్టర్ బికుమాండ్ల వాసు, కొరివి వెంకటయ్య, కండె సత్యనారాయణ, బికుమాండ్ల నర్సింహ, విడియాల రవి, కండె రాముడు, అర్థం లక్ష్మయ్య, మంచని రాజు, బికుమాండ్ల కృష్ణయ్య, దొంతు సత్యనారాయణ, బొజ్జ నర్సింహ, కండె సాయి, సామల రవి, జూలూరి సత్యనారాయణ, సుండూరు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చట్టసభలను అవమానిస్తున్న మోదీ

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చుక్కా రాములు

హయత్‌నగర్ : ఆర్డినెన్స్‌తో చట్ట సవరణలు చేసి, చట్టసభలను ప్రధాని నరేంద్రమోదీ అవమానపరుస్తున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చుక్కా రాములు అన్నారు. బుధవారం అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తుర్కయంజాల్‌లోని సామ శ్రీనివాస్‌రెడ్డి గార్డెన్ లో సీపీఎం రంగారెడ్డి జిల్లా శాఖ కార్యదర్శుల సమావేశం జిల్లా కోర్ కమిటీ సభ్యుడు పి.యాదయ్య అధ్యక్షతన జరిగింది. సమావేశానికి హాజరైన చుక్కా రాములు మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 3 సంవత్సరాలు పూర్తవుతున్నా ధరలు తగ్గలేదన్నారు. రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామన్న కేంద్ర ప్రభుత్వం హామీ హామీగానే మిలిగిపోయిందని చెప్పారు. చట్టాలను అగౌరపరిచేలా వ్యవహరించడం ఈ ప్రభుత్వానికే చెల్లిందన్నారు. ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేసి ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహిస్తుందని ఆరోపించారు. గోరక్షణ పేరుతో దళితులపైన, మైనారిటీలపైనా దాడులు జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూని చేస్తుందని తెలిపారు. ధర్నాలు చేయకుండా ధర్నా చౌక్‌ను ఎత్తివేశారనీ, ఇది కేసీఆర్ నిరంకుశ వైఖరికి నిదర్శమని విమర్శించారు. సీపీఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి భూపాల్ మాట్లాడుతూ అధికార పార్టీ నాయకుల భూ కుంభకోణాలు పెరిగిపోతున్నాయన్నారు. మియాపూర్, అబ్దుల్లాపూర్‌మెట్, ఇబ్రహీంపట్నం, శంషాబాద్ మండలాలలో వేలాది ఎకరాలు కబ్జాల పాలయ్యాయన్నారు. సెప్టెంబర్ 10న కందుకూర్‌లో భూసదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఈ.నర్సింహ, తుర్కయంజాల్ జోన్ పార్టీ బాధ్యుడు కిషన్, అరుణ్ కుమార్, శ్యామ్యూల్, మధుసూదన్‌రెడ్డి, రాంచందర్, సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చుక్కా రాములు

నూతన పెన్షన్ విధానంపై జిల్లాలో 28న ఆందోళన

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్)

దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారం కోసం రంగారెడ్డి జిల్లా ఉపాధ్యాయుల సంయుక్త కార్యాచరణ సమితి (జాక్టో) ఏర్పాటు కావటం సంతోషకరమని జాక్టో స్టీరింగ్ కమిటీ సభ్యులు ప్రవీణ్ కుమార్, పరమేశ, వెంకట్‌రెడ్డి, చేవెళ్ల స్వామి, బషీర్, అనీల్, శ్రీనివాస్, భాస్కర్, నరేందర్ అంజయ్య , వినోద్, సురేష్, అన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 28న జాక్టో ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి నూతన పెన్షన్ విధానానికి వ్యతిరేకంగా ఉపాధ్యాయులంతా నిరసన తెలియజేయనున్నట్లు చెప్పారు. ఉపాధ్యాయులు సామూహికంగా సెలువు పెట్టి ధర్నాకు హాజరు కావాలని వారు కోరారు.

పంచాయతీల్లో.. లెక్క తప్పుతోంది...

నిధుల ఖర్చుపై లెక్కచూపని సర్పంచ్‌లు ఉక్కుపాదం..
బండ్లగూడ పంచాయతీలో రూ. కోటి దుర్వినియోగం
అధికారుల ప్రాథమిక విచారణలో నిర్ధారణ

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్)

జిల్లాలో కొన్ని గ్రామ పంచాయతీలు అవినీతి అక్రమాలకు కేరాఫ్‌గా మారాయి. కొంత మంది సర్పంచ్‌లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ.. అడ్డగోలుగా బిల్లులు 'డ్రా' చేసుకుంటున్నారు. ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కేస్తూ.. నిధుల దుర్వినియోగానికి పాల్పడుతున్నారు. పంచాయతీ సభ్యులకు తెలియకుండానే నిధులు డ్రా చేసుకుంటున్నారు. ఒక పనికి తీర్మానం చేసి నాలుగైదు పనులు చేస్తున్నారు. రూ. లక్షకు పైబడిన పనులకు అడ్మినిస్ట్రేషన్ మంజూరు తీసుకోవాల్సి ఉండగా అందుకు బిన్నంగా వ్యవహరిస్తున్నారు. బోర్ మోటర్ల రిపేర్లు, నీటి సరఫరాకు సంబంధించిన ఎంబీలు లేకుండానే నిధులు 'డ్రా' చేసుకుంటున్నారు. దొంగ బిల్లులు పెడుతూ అవినీతికి పాల్పడుతున్నారు. ఒక మోటర్ కాలిపోతే నాలుగు కాలిపోయినట్లు, విద్యుత్ బిల్లులు, వీధిలైట్ల బిల్లుల 'డ్రా'కు సంబంధించి లెక్క పత్రం లేకుండా పోయిందనే విషయాన్ని అధికారులు గుర్తించారు. ప్రభుత్వ నిధుల దుర్వినియోగం జరుగుతున్నట్లు అధికారుల విచారణలో ఒకొక్కక్కటిగా బయటపడుతున్నాయి. ఇప్పటికే నార్సింగి గ్రామ పంచాయతీలో జరిగిన రూ. 53 లక్షల అవినీతి భాగోతంపై సర్పంచ్‌పై సస్పెన్షన్ వేటు పడింది. మిగతా సర్పంచ్‌లపై చర్యలు తీసుకునేందుకు రంగం సిద్దమైంది.

ఆగమనగల్లు పంచాయతీలో అవినీతి అక్రమాలు చోటుచేసుకున్నాయని అధికారులకు ఇప్పటికే ఫిర్యాదు లందాయి. అలాగే ముద్విన్ పంచాయతీలో నిధులు దుర్వినియోగం అయినట్లు కొంతమంది గ్రామస్థులు జిల్లాస్థాయి అధికారులకు ఫిర్యాదు చేశారు.

దీనికి సంబంధించి త్వరలో అధికారులు విచారణ చేపట్టనున్నారు. తల కొండపల్లి మండలం పడకల్ గ్రామ పంచాయతీలో రూ. 9 లక్షల అవినీతి జరిగిందని గ్రామస్థులు ఫిర్యాదు చేయటంతో.. అధికారులు విచారణ సిద్దమయ్యారు. హయత్‌నగర్ మండలం రాగన్నగూడ పంచాయతీలో రూ.2 లక్షలు, ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లిలో 1.70 లక్షలు, యాచారం మండలం గడ్డమీది మల్లయ్య గూడలో రూ. లక్ష దుర్వినియోగం అయినట్లు అధికారులు గుర్తించారు. అవినీతికి పాల్పడిన కొన్ని పంచాయతీల్లో ఇప్పటికే డబ్బులను రికవరీ చేయటం జరిగింది. అందు లో హయత్‌నగర్ మండలం తుర్కఎంజాల్ గ్రామ పంచాయతీలో రూ. 2.40 లక్షలు, ఇబ్రహీంపట్నం మండలం మంగళపల్లిలో రూ. 51 వేయి రికవరీ చేశారు.

బండ్లగూడలో మింగేసిన రూ. 98,48,993

రాజేంద్రనగర్ మండలం బండ్లగూడ జాగీర్ గ్రామ పంచాయతీలో రూ.98,48,993 నిధులు దుర్వినియోగం జరిగింది. అదేవిధంగా రూ. 2,18,24,524 అభ్యంతకర ఖర్చులు చేసినట్లు అధికారులు ప్రాథమిక విచారణంలో గుర్తించారు. సర్పంచ్ గంగని హరికృష్ణ నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్లు ఎంపీటీసీ, వార్డు సభ్యులు 2017 ఏప్రిల్ 17న జిల్లా పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన అధికారులు విచారణ చేపట్టారు. అదే నెల 26వ తేదీనా అధికారులు చేసిన ప్రాథమిక విచారణలో రూ. 98,48,993 నిధులు దుర్వినియోగం చేసినట్లు తేలింది. అదే విధంగా రూ.2,18,24,524 కోట్లను అభ్యంతరకర ఖర్చులు చేసినట్లు నిర్ధారించారు. పంచాయతీరాజ్ చట్టం 249 ప్రకారం అధికార దుర్వినియోగం పాల్పడిన సర్పంచ్‌పై చర్యలు తీసుకునేందుకు సంజాయిషీ కోరుతూ షోకాజ్ నోటీసు జారీచేయటం జరిగింది.

పది రోజుల్లో జవా బివ్వాలని... నిర్ణీత గడువులోగా జవాబు రాకుంటే.. చట్ట రీత్య చర్యలు తీసుకోవటం జరుగుతుందని నోటీసులో స్పష్టం చేశారు.

అవినీతికి పాల్పడితే చర్యలు తప్పవు

డీపీవో పద్మజ

అవినీతికి పాల్పడితే చర్యలు తప్పవు. జిల్లాలో కొన్ని పంచాయతీల్లో లెక్కలు తప్పాయి. ఇష్టానుసారంగా ప్రభుత్వ నిధులు ఖర్చు చేశారు. ఖర్చు చేసిన నిధులకు సంబంధించి లెక్కలు లేవు. బండ్లగూడ జాగీర్ పంచాయతీ సర్పంచ్ కోటి రూపాయలు నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. అలాగే మరో రూ.2 కోట్ల నిధులకు సంబంధించిన అభ్యంతరకర ఖర్చు చేశారు. సర్పంచ్‌కు షోకాజ్ నోటీసు జారీ చేయటం జరిగింది. లెక్కలు చూపకుంటే.. డబ్బులు రికవరిచేస్తాం.



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కొరవడిన పరిశుభ్రత అంటూ బుధవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించి డ్రైనేజీని శుభ్రం చేశారు. ఫకీర్‌టెక్యా తండాలో మూడు నెలలుగా డ్రైనేజీలను శుభ్రపరచక పోవడంతో డ్రైనేజీలు పొంగి పొర్లుతూ రోడ్లపై ప్రవహిస్తున్న విషయాన్ని ఆంధ్రజ్యోతి వెలుగులోకి తీసుకొచ్చింది. దీంతో బుధవారం ఇంచార్జీ కార్యదర్శి శ్రావణ్‌కుమార్ సిబ్బందితో డ్రైనేజీని శుభ్రం చేయించారు. -ఘట్‌కేసర్

పుట్టగొడుగుల్లా సెల్ టవర్లు

- ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం
- పట్టించుకోని అధికార యంత్రాంగం

కీసర: మండలంలోని పలు గ్రామాలలో సెల్ టవర్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. పన్నులు చెల్లించకుండా గ్రామపంచాయతీ ఆదాయానికి గండి కొడుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని పలువురు వాపోతున్నారు. మండల పరిధిలోని దమ్మాయిగూడ, నాగారం, రాంపల్లి, కీసర, అహ్మద్‌గూడ గ్రామాలలో నియమ నిబంధనలు ఏమాత్రం పాటించుకోకుండా ఇంటి యజమానులు వివిధ కంపెనీలకు సంబంధించిన సెల్ టవర్లకు భవనలు అద్దెకు ఇస్తున్నారు. సాంకేతిక మాధ్యమం సిగ్నల్స్ కోసం ఆయా కంపెనీల యజమానులు ఇంటి యజమానులు అద్దె చెల్లిస్తూ నియమ నిబంధనలకు విరుద్ధంగా ఇళ్లపై ఇష్టానుసారంగా టవర్లు ఏర్పాటు చేస్తున్నారు. కొంతమంది స్థానిక ప్రజాప్రతినిధుల అండదండలతో, స్థానిక అధికారుల ప్రోత్సాహంతో యథేశ్చగా కార్యకలాపాలను కొనసాగిస్తున్నారు. సెల్ టవర్ల నిర్వాహకులు ఎలాంటి రుసుము చెల్లించకుండా ప్రభుత్వాదాయానికి గండికొడుతూ లాభాలు గడిస్తున్నారు. నిర్వహకులే కాకుండా సెల్ టవర్ల కోసం ఇంటిపై ఖాళీ స్థలం అద్దెకు ఇస్తున్న ఇంటి యజయానులు సైతం నెలనెల అద్దె తీసుకుంటున్నారే తప్పా, గ్రామపంచాయతీకి ఎలాంటి పన్నులు చెల్లించడం లేదనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఆయా గ్రామాల్లో జనావాసాల నడుమ టవర్లు ఏర్పాటు చేస్తుండంతో తీవ్ర అనారోగ్యాల బారిన పడుతున్నామని ఆయా గ్రామాల కాలనీ వాసులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. చిన్నారులు, వృద్ధులు నెలల తరబడి ఆసుపత్రుల చుట్టు ప్రదక్షిణలు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల నాగారం, దమ్మాయిగూడ గ్రామంలోని ఆయా కాలనీలల్లో సెల్ టవర్ల ఏర్పాటు చేయవద్దని, టవర్లతో తమ ఆరోగ్యాలు చెడిపోతాయని నిర్మాణ పనులు అడ్డుకున్నారు. కాగా నిర్వహకులకు సెల్ టవర్ల ఏర్పాటు ముఖ్యంగా కావడంతో, ప్రజాప్రతినిధుల, అధికారుల అండదండలతో రాత్రిళ్లు టవర్ల నిర్మాణం పనులు చేపడుతూ జనాలకు నిద్రహారాలకు దూరం చేస్తు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నత అధికారులు స్పందించి అనుమతులు లేకుండా ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడుతూ పుట్టగొడుగుల్లా ఏర్పాటు చేస్తున్న టవర్ల యజమానులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



దమ్మాయిగూడలో నిర్మిస్తున్న సెల్ టవర్

'మత్తుకు దూరంగా ఉండాలి'



బహుమతి ప్రధానం చేస్తున్న డీసీపీ ఉమామహేశ్వర్ శర్మ

కీసర: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని మాల్కాజ్‌గిరి డీసీపీ ఉమామహేశ్వర్ శర్మ అన్నారు. బుధవారం మండల పరిధి చీర్యాల్ గ్రామంలోని గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాలలో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా జరిగిన అవగహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో యువత డ్రగ్స్‌కు బానిసై వారి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రగ్స్ వల్ల జీవితాలు వ్యర్థమౌతాయని, డ్రగ్స్‌కు బానిసైనవారి కుటుంబ సభ్యులు ఎన్నో ఇబ్బందులకు గురి కావాల్సి వస్తుందని ఆయన అన్నారు. మత్తు పెను ప్రమాదం అని, దాని వల్ల ప్రాణాలు కూడా కోల్పోవల్సి వస్తుందని ఆయన గుర్తు చేశారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండి జీవిత లక్ష్యాలను అధిరోహించాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు డ్రగ్స్ వ్యతిరేకంగా వ్యాస రచన పోటీలు నిర్వహించగా, గెలుపొందిన విద్యార్థికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కీసర సిఐ సురేందర్ గౌడ్‌లతో పాటు కళాశాల బృందం పాల్గొన్నారు.

'26న గాయత్రీ పీఠంలో రుషీ పంచమి వేడుకలు'



అన్నోజిగూడలోని గాయత్రీ పీఠం ఆలయం

ఘట్‌కేసర్: మండల పరిధిలోని అన్నోజిగూడ గ్రామంలో గల శ్రీ మాతా సేవాశ్రమం(గాయత్రీ పీఠం)లో రుషీ పంచమీ వేడుకలు ఈ నెల 26న నిర్వహిస్తున్నట్లు గాయత్రీ పీఠం నిర్వహకులు తెలిపారు. బధ్రపద శుద్ధ పంచమీ (రుషీ పంచమీ) సందర్భంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు విశేష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. హిందు ధర్మానికి పట్టుకొమ్మలైన రుషుల రుణాన్ని తీర్చుకోవడానికి ఇది ఒక మహత్తర కార్యక్రమమని అన్నారు. శ్రీ మాత సేవాశ్రమంలో లక్ష్మీగణపతి-గాయత్రీ దేవి, పార్వతీ దుబ్బరాజేశ్వర స్వామి ప్రతిష్ఠించడంతో పాటు రుషులను స్మరించే ఉద్దేశంతో సప్తరుషులతో పాటు వ్యాస వాల్మీకి రుషులను ప్రతిష్ఠించడం జరిగిందన్నారు. రుషి పంచమీనాడు జరిగే ఈ కార్యక్రమంలో రుషులు లోకకల్యాణం కోసం మహత్తర కార్యక్రమాలు స్మరించాలని గుర్తు చేశారు. ఈ సందర్భంగా గాయత్రీదేవి సుప్రభాత సేవ పార్వతి, దుబ్బరాజేశ్వర స్వామికి మహాన్యాస శత రుద్రాభిషేకం రుషి దంపతులుగా బావించి బ్రహ్మణ దంపతులకు సప్తరుషి పూజ కార్యక్రమం, సప్త రుషిధ్యాన మందిరంలో సప్త రుషిలపూజ కార్యక్రమాలు ఉంటాయి. ఆ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

వార్డు సభ్యుడికి వ్యతిరేకంగా ఆందోళన



ఆందోళన చేస్తున్న మహిళలు

కీసర: వార్డు సభ్యురాలిపై తోటి వార్డు సభ్యుడు అనుచిత వాఖ్యలు చేశారని, దానికి వ్యతిరేకంగా సభ్యురాలి మద్దతుదారులు నాగారం గ్రామపంచాయతీ ఎదుట ఆందోళన చేశారు. మండల పరిధిలోని నాగారం గ్రామంలోని 7వ వార్డులో రోడ్డును కబ్జా చేసి ఇంటి నిర్మాణాలు చేపడుతున్నారని స్థానిక వార్డు సభ్యురాలు స్వప్న పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశారు. కాగా నిర్మాణాలు లేఅవుట్లో ఉన్న దాని ప్రకారమే నిర్మాణాలు చేపడుతున్నామని నిర్మాణదారుడు పేర్కొనగా, నిర్మాణదారుడికి మద్దతు పలుకుతూ స్థానిక వార్డు సభ్యుడు అనుచిత వాఖ్యలు చేశారని వార్డు సభ్యురాలు స్వప్న పేర్కొన్నారు. అనుచిత వాఖ్యలు చేసిన వార్డు సభ్యుడు క్షమాపణ చెప్పాలని వార్డు సభ్యురాలు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. దీంతో కల్పించుకున్న సర్పంచ్ కౌకుట్ల చంద్రారెడ్డి, కార్యదర్శి వెంకటరెడ్డి, కాంగ్రెస్ వార్డు సభ్యుల ఫోరం అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, వార్డు సభ్యులు సాయినాథ్ గౌడ్, జగన్మోహన్‌రెడ్డిలు వార్డు సభ్యుడు అందుబాటులో లేడని పేర్కొన్నారు. అతను అందుబాటులోకి రాగానే తగిన న్యాయం చేస్తామని నచ్చజేప్పి అక్కడి నుంచి మహిళలను పంపించారు.

'సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించాలి'



తహసీల్దారుకు వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ కార్యకర్తలు

ఘట్‌కేసర్: సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఘట్‌కేసర్ తహసీల్దారుకు భారతీయ జనత పార్టీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు కంభం లక్ష్మారెడ్డి మాట్లాడుతూ దేశానికి మొత్తం 15 ఆగస్టు 1947న స్వాతంత్ర్యం వస్తే తెలంగాణకు మాత్రం సెప్టెంబర్ 17న విముక్తి లభించిందన్నారు. నిజాం పాలనను అంతమొందించడానికి వేలాది మంది రైతులు తుపాకులు పట్టుకొని సాయుధ పోరాటం చేశారని గుర్తు చేశారు. రజాకార్ల ఆకృత్యాలు అడ్డుకోవడానికి విరోచిత పోరాటాలు చేసి తెలంగాణ ప్రాంతాన్ని విముక్తి గావించారని తెలిపారు. రజాకర్లు గ్రామాలపై పడి ఖాసీం రజ్వీ నేతృత్వంలో ప్రజల మానప్రాణాలను హరించి తీవ్ర చిత్ర హింసలకు గురిచేసినట్లు వివరించారు. సమస్త తెలంగాణ ప్రజలు పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలోనైనా సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించి తెలంగాణ అమర వీరుల త్యాగాలను స్మరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శులు ఏదుగని శ్రీరాములు, అచ్చిని రమేష్, కార్యకర్తలు రాజరమేష్, ఉపేందర్, శోభరాణి, అజయ్‌కుమార్, బుచ్చయ్య, బివిరెడ్డి, పాండు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో మిజిల్స్, రూబెల్లాపై

విస్తృత ప్రచారం నిర్వహించాలి : రవికుమార్



అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య విద్యాబోధకుడు

ఘట్‌కేసర్: గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలకు మిజిల్స్, రుబెల్లా టీకాల ప్రాముఖ్యత గురించి విస్తృత ప్రచారం నిర్వహించాలని మండల ఆరోగ్య విద్యాబోధకుడు వీపూరి రవికుమార్ కోరారు. బుధవారం ఘట్‌కేసర్‌లోని గ్రామపంచాయతీ కార్యాలయం సమీపంలో గల అంగన్‌వాడీ కేంద్రంలో మీజిల్స్, రుబెల్లాపై ఎఎన్‌ఎంలు, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీజిల్స్ ఒక ప్రాణాంతక వ్యాధి అని ఇది వైరస్ ద్వారా ఒకరి ద్వారా మరోకరికి వ్యాపిస్తూ వైకల్యాని కల్గించడమే కాకుండా అకాల మరణానికి దారి తీస్తుందన్నారు. ప్రపంచంలో జరిగే మీజిల్స్ మరణాలలో భారత దేశంలో 35 శాతం మంది పిల్లలు మృతి చెందుతున్నారని గత సంవత్సరంలోనే 49,200 మంది పిల్లలు మృతి చెందారని తెలిపారు. వ్యాధిగ్రస్తుడు ఇతరులకు ఈ వ్యాధి వ్యాపిస్తుందని తీవ్రమైన జ్వరం, శరీరంపై ఎరుపు రంగు మచ్చలు, దగ్గు, జలుబు, కళ్ళు ఎరుపు పడటం వంటి లక్షణాలు కనిపిస్తాయని తెలిపారు. గర్భిణీలకు తొలిదశలో రుబెల్లా సోకితే అది పిండంపై తీవ్ర ప్రభావం చూపి పుట్టే బిడ్డకు కంటి, వినికిడి, మెదడుతో పాటు గుండె జబ్బులతో పుట్టే ప్రమాదం ఉందన్నారు. దేశంలో ప్రతి సంవత్సరం ఇలాంటి జబ్బులతో జన్మిస్తున్నారని ఇలాంటి మహ్మరి జబ్బులను నివారించడానికి ప్రవేశపెట్టిన టీకాను పిల్లందరికి చేరేవిధంగా ఎఎన్ఎం, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు నిరంతరం కృషి చేస్తూ గ్రామీణ ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించి మీజిల్స్, రుబెల్లా వ్యాధులను తరిమికొట్టాలని సూచించారు. కార్యక్రమంలో సునంద, సుజాత, సత్యనారాయణ, రమణి, సువర్ణ, ధనలక్ష్మీ, పాల్గొన్నారు.

ఘట్‌కేసర్ మండల పరిధిలోని పోచారం సంస్కృతిటౌన్‌షిప్‌లో బుధవారం కదంభం పూలు విరబూశాయి. యేడాదిలో ఒక్కసారి మాత్రమే పూసే ఈ పూలు దేవతలకు ఎంతో ప్రీతిపాత్రమైన ప్లాట్స్ ఓనర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు హరిప్రసాద్ రావు వివరించారు. ముఖ్యంగా ఉత్తరాది రాష్ట్రాలలో ఈ పూలకు ఎంతో ప్రాముఖ్యత ఉంటుందన్నారు. -ఘట్‌కేసర్





వినాయక ఉత్సవాల్లో

జాగ్రత్తలు తప్పనిసరి

● రేపటినుంచి ప్రారంభం కానున్న గణనాథుల పూజలు ● మండపాల ఏర్పాటులో నాణ్యమైన సామగ్రి వాడాలి ● విద్యుత్ ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలి ● పోలీసుల సూచనలు తప్పనిసరిగా పాటించాలి



ట్రాక్టర్‌లో వినాయక ఊరేగింపు(ఫైల్)

వికారాబాద్(ఫీచర్స్) : శుక్రవారం నుంచి ఊరూ, వాడా అంతటా వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. చవితితో ప్రారంభమయ్యే ఉత్సవాలను 9, 11 రోజులపాటు ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు సర్వం సిద్ధం చేశారు. పండుగ రోజు ప్రతిష్ఠించడానికి వినాయక విగ్రహాల బుకింగ్‌లు నెల రోజుల క్రితం నుంచే మొదలయ్యాయి. పండుగ దగ్గరపడడంతో ఉత్సవ కమిటీల సభ్యులందరూ విగ్రహాల తరలింపు, మండప అలంకరణ కార్యక్రమాల్లో నిమగ్నమయ్యారు. అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకునే ఈ ఆది దేవుడి పండుగ వేడుకల్లో ప్రతి ఏటా చిన్నపాటి అజాగ్రత్తల కారణంగా ఎక్కడో ఓచోట అపశ్రుతులు చోటుచేసుకుంటున్నాయి. తగు జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల గతంలో పలువురు మృతి చెందిన ఘటనలు కూడా జిల్లాలో జరిగాయి. ఈ నేపథ్యంలో విక్రయ కేంద్రాల నుంచి మండపాలకు వినాయక విగ్రహాల తరలింపు దగ్గర నుండి నిమజ్జనం వరకు ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి, ఏయే నియమాలను అనుసరించాలనే దానిపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం..



నిమజ్జనానికి తీసుకెళుతున్న నిర్వాహకులు(ఫైల్)

ఆది దేవుడికీ తప్పని జీఎస్టీ సెగ

● భారీగా పెరిగిన ముడిసరుకుల ధరలు, విగ్రహాల రేట్లు



ఆది దేవుడు వినాయకుడికి కూడా వస్తు సేవల పన్ను (జీఎస్టీ) సెగ తాకింది. జీఎస్టీ ఎఫెక్ట్‌తో వినాయక విగ్రహాలను తయారీలోవాడే ముడిసరుకుల ధరలు చాలా వరకు పెరిగాయి. జీఎస్టీ కారణంగా గతంలో రూ.200 ఉన్న ప్లాస్టర్ ఆఫ్ పారిస్ బస్తా ధర ప్రస్తుతం రూ.250కి చేరింది. పీఓపీతో పాటు విగ్రహాల తయారీ లోవాడే స్టీలు, ఇతరత్రా సామాగ్రి ధర కూడా చాలావరకు పెరిగింది. దీంతో విగ్రహాల తయారీదారులకు ముడిసరుకులకు అయ్యే ఖర్చు గత ఏడాదితో పోల్చితే బాగా ఎక్కువైంది. ఈ ప్రభావం విగ్రహాల ధరలపై స్పష్టంగా కనిపిస్తోంది. గతంలో భారీ గణనాథుల విగ్రహాలు సైజును బట్టి రూ.10,000 నుంచి రూ.15,000 వరకు పలికేవి. కానీ ప్రస్తుతం వాటి ధరలు రూ.15,000 నుంచి రూ.20,000 వరకు పలుకుతున్నాయి. దీంతో కొనుగోలుదారులకు చుక్కలు కనిపిస్తున్నాయి. పండుగ దగ్గర పడుతుండడంతో విగ్రహాల కొనుగోళ్లు ఊపందుకున్నాయి. కాగా జీఎస్టీ ప్రభావంతో ఈసారి తమకు ఆశించిన స్థాయిలో లాభాలు రావడం లేదని వ్యాపారస్తులు చెబుతున్నారు.

పోలీసుల సూచనలు పాటించాలి

- వినాయక ఉత్సవాలను నిర్వహించాలనుకునేవారు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలి.
- వారి సలహాలు, సూచనలు తప్పనిసరిగా పాటించాలి. నిమజ్జనం రోజున వారికి సమాచారం ఇవ్వాలి.
- దానివల్ల వారు పరిస్థితిని బట్టి తగు బందోబస్తును ఏర్పాటు చేసే వీలు కలుగుతుంది.
- మైక్ సెట్ల ఏర్పాటుకు అధికారుల నుంచి అనుమతి పొందాలి.
- అనుకోకుండా ఏవైనా ప్రమాదాలు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి.
- రాత్రి 10 గంటల తర్వాత మండపాల వద్ద ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించరాదు.
- రాత్రిపూట మండపంలోనే నిద్రించేందుకు ముగ్గురు వలంటీర్లను ప్రత్యేకంగా నియమించాలి.
- ఎలాంటి గొడవలు, వైషమ్యాలకు తావు లేకుండా స్నేహపూర్వక వాతావరణంలో ఉత్సవాలు జరుపుకోవాలి.

మండపాలకు విగ్రహాలను చేర్చడంలో జాగ్రత్తలు

- వినాయక చవితి ఉత్సవాల్లో మొదటి ఘట్టం విక్రయ కేంద్రాల నుంచి వాహనాల్లో విగ్రహాలను మండపాలకు తరలించడం.
- ముఖ్యంగా భారీ సైజులో ఉండే గణనాథుల విగ్రహాలను తీసుకువచ్చేందుకు కండిషన్ బాగా ఉన్న వాహనాలనే ఉపయోగించాలి. వాహన డ్రైవర్ అనుభవజ్ఞుడై ఉండాలి.
- ముఖ్యంగా మద్యం తాగి వాహనం నడపరాదు.
- వాహనాన్ని నెమ్మదిగా పోనివ్వాలి. పోటీ వాతావరణానికి తావివ్వకూడదు.
- వాహనంలో ఎక్కువ మంది ఎక్కకూడదు.
- రోడ్డు పొడవునా వాహనం వెళ్లేటప్పుడు పొడవాటి కర్ర సాయంతో విద్యుత్ తీగలను పైకి లేపుతూ అవి విగ్రహానికి తగలకుండా చూసుకోవాలి.
- ఇందుకోసం ప్రత్యేకంగా ఒకరిద్దరు సభ్యులను నియమించాలి. విగ్రహాలను వాహనంలోకి ఎక్కించేటప్పుడు, అదేవిధంగా మండపంలోకి దించేటప్పుడు అప్రమత్తంగా వ్యవహరించాలి.

నాణ్యమైన సామగ్రి వాడాలి

- గణనాథులు కొలువుదీరేందుకు ఏర్పాటుచేసే మండపాలు పకడ్బందీగా ఉండేలా చర్యలు తీసుకోవాలి.
- నిర్మాణానికి ఉపయోగించే కర్రలు, రేకులు ఇతర సామాగ్రి నాణ్యతగా ఉండేలా చూడాలి.
- గాలిదుమారం వచ్చినపుడు, భారీ వర్షాలు కురిసినపుడు మండపం కూలిపోయే ప్రమాదం ఉంటుంది.
- గణనాథుడి ప్రతిమ వద్ద అనుక్షణం దీపాలు వెలుగుతుంటాయి కాబట్టి దగ్గరలో వస్త్రాలు, పూలదండలు, అలంకార సామాగ్రి, పెట్రోల్, కిరోసిన్ వంటి ఇంధనాలు ఉంచకూడదు.
- రహదారికి అడ్డంగా మండపాలను ఏర్పాటు చేస్తే వాహనదారులకు ఇబ్బందులు తలెత్తుతాయి.
- సాధ్యమైనంతవరకు రోడ్లకు కొంచెం దూరంలో ఏర్పాటు చేయడం మంచిది.
- ఏదైనా ఖాళీ స్థలంలో మండపాలను ఏర్పాటు చేయదలచుకుంటే ముందుగా ఆ స్థలం యజమానితో సంప్రదించి అనుమతి తీసుకోవడం మంచిది.

విద్యుత్ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తపడాలి

- మండపాల్లో విద్యుత్ సౌకర్యం ఏర్పాటు విషయంలో చాలామంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంటారు.
- దీనివల్ల ప్రమాదం జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుంది.
- అధికారికంగా విద్యుత్ కనెక్షన్ ఉన్నట్లయితే సంబంధిత సిబ్బంది వచ్చి పరిశీలించి ప్రమాదాలు జరగకుండా వైరింగ్ చేసి కనెక్షన్ ఇస్తారు.
- చాలామంది నిర్వాహకులు అనధికారికంగా మండప సమీపంలోని స్థంభాల నుంచి లాగిన విద్యుత్ తీగలకు వైరింగ్ కలిపి తద్వారా విద్యుత్ సరఫరా జరిగేలా తాత్కాలిక ఏర్పాటు చేసుకుంటారు.
- ఇందులో ఏవైనా పొరపాట్లు జరిగితే విద్యుత్ ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉంటుంది.
- కాబట్టి నిపుణుల ఆధ్వర్యంలో కనెక్షన్ తీసుకోవడం అత్యంత శ్రేయస్కరం. ముందు జాగ్రత్త చర్యగా మండపాల వద్ద మంటలను ఆర్పే సాధనాలను అందుబాటులో ఉంచుకోవాలి.

నిమజ్జన సమయంలో

- ఉత్సవాల అనంతరం వినాయక నిమజ్జన సమయంలో అత్యంత అప్రమత్తతతో వ్యవహరించాలి.
- ముఖ్యంగా ఈ కార్యక్రమంలో పాల్గొనేవారు మద్యం, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి.
- కోలాటాలు, భజనలు, సాంప్రదాయక ఆట, పాటలతోనే నిమజ్జన కార్యక్రమం నిర్వహించడం చాలా మంచిది.
- చిన్నపిల్లలు, ఈత రాని వారిని చెరువులు, కుంటల వద్దకు వెళ్లకుండా వారి కుటుంబ సభ్యులు కట్టడి చేయాలి.
- సాధ్యమైనంతవరకు చీకటి పడకముందే ఈ కార్యక్రమం ముగించడం శ్రేయస్కరం.

మధ్యాహ్న భోజనానికి

కూరగాయల మంట

● ఆకాశాన్నంటిన ధరలు

● పప్పు సాంబారుతోనే విద్యార్థులకు వడ్డింపు

● వంటలో కనిపించని టమాట



మధ్యాహ్న భోజనం తింటున్న బాలికలు(ఫైల్)

యాచారం : కూరగాయల ధరలు అమాంతం పెరగడంతో మధ్యాహ్న భోజనంపై తీవ్ర ప్రభావం పడింది. పథకం అమలవుతున్న అన్ని పాఠశాలల్లో ప్రస్తుతం నిర్వాహకులు కూరగాయలు వండేందుకు నానా తంటాలు పడుతున్నారు. గత రెండు నెలలుగా కూరగాయల ధరలు పెరగడం మూలాన విద్యార్థులకు పప్పు, సాంబారుతో సరిపుచ్చుతున్నారు. పలుచోట్ల చింతపండుతో పచ్చిపులుసుతో కాలం వెల్లదీయక తప్పడం లేదు. కూరగాయల ధరలు పెరగడంతో వంట వారు కూరగాయల జోలికి వెళ్లడం లేదు. యాచారం మండలంలోని 20 పంచాయతీల్లో 50పాఠశాలలున్నాయి. పదకొండు జడ్పీ ఉన్నత పాఠశాలలున్నాయి. 50పాఠశాలల్లో 2,260 మంది బాలురు, 2,719మంది బాలికలు, మొత్తం 4,979మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలకు కేవలం పేద విద్యార్థులు వస్తున్నారు. వారిని గమనంలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజనం అందుతుంది. ఈ క్రమంలో వారంలో మూడురోజులు పప్పు, సాంబారుతో సహా ఉడకబెట్టిన కోడిగుడ్డు మరో రెండు రోజులు కూరగాయలు, మిగిలిన ఒక రోజు ఆకుకూరలు వండి వడ్డించాలి. ప్రస్తుతం కూరగాయల ధరలు పెరగడంతో మెను ప్రకారంగా భోజనం పెట్టలేకపోతున్నారు. అంతా వారి ఇష్టానుసారంగా వండిపెడుతున్నారు. కూరగాయల ధరలు అందుబాటులో లేకపోవడంతో మధ్యాహ్న భోజన నిర్వాహకులు ప్రత్యామ్నాయం వైపు మొగ్గుచూపుతున్నారు. ప్రతి పాఠశాలలో సాంబారుతోనే కాలం వెల్లబుచ్చుతుండడం విశేషం. మధ్యాహ్న భోజన పథకం నిర్వహణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వమే పౌరసరఫరాల శాఖ ద్వారా నేరుగా పాఠశాలలకే బియ్యం అందిస్తున్నారు. ఒక్క విద్యార్థికి 4.18రూపాయలు, 6 నుంచి 10తరగతి వరకు పూటకు 6.18 రూపాయలు వెచ్చిస్తుంది. వాటికి తోడుగా అదనంగా కోడిగుడ్డుకు 4రూపాయలు చెల్లిస్తుంది. కాగా నేడు కిలో టమాటా 110రూపాయలు, వంకాయ కిలో 50రూపాయలు, బెండకాయ కిలో 45రూపాయలు, బీరకాయ కిలో 38రూపాయలు, సొరకాయ కిలో 52రూపాయలు, చిక్కుడు కిలో 35రూపాయలు, పచ్చిమిర్చి కిలో 100రూపాయలకు విక్రయిస్తున్నారు. కూరగాయల ధరలు పెరగడం కారణంగా ఎలా పెట్టాలో తోచడం లేదని వంట వారు ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ ఆందోళన చెందారు. కూరలో టమాటా పెట్టడం మానేశారు. కూరగాయల కొనుగోలుకు అప్పులు చేస్తున్నామని వంటవారు చెప్పారు. మేడిపల్లి నక్కర్త జడ్పీ ఉన్నత పాఠశాలలో 421మంది, గున్‌గల్ జడ్పీ ఉన్నత పాఠశాలలో 435మంది బాలబాలికలు ఉన్నారు. ఈ పాఠశాలల్లో మెనూ ప్రకారంగా ఒక విద్యార్థికి 75గ్రాముల కూరగాయలు అవసరమవుతాయి. పప్పు, సాంబారు, చారు అయితే 30గ్రాముల పప్పు మధ్యాహ్న భోజన వంటలో వినియోగించాలి. నూనె 8గ్రాములు వాడాలి. కూరగాయలు వండిన రోజు 31.5 కిలోల కూరగాయలు, ఈ లెక్కన 421మంది విద్యార్థుల కూరల ఖర్చు కోసం నిర్వాహకులకు 3వేల రూపాయలు అవుతుండగా వారికిచ్చే మొత్తం 2,583 రూపాయలు మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం ఇస్తుంది.

సకల కళా కోవిదుడు.. డీవీవీఎస్

కవిగా.. గాయకుడిగా..
ఉపాధ్యాయుడిగా..
వ్యాఖ్యాతగా..
పలువురు ప్రముఖులచే
ప్రశంసలు, సన్మానాలు

షాద్‌నగర్‌టౌన్: ఒక మనిషి ఒకే కళలో ఆరితేరి ఉంటే అతన్ని కళాకారుడు అంటారు. ఒకే మనిషి సకల కళల్లో నైపుణ్యం ప్రదర్శిస్తే అతన్ని సకల కళా కోవిధుడు అంటారు. ఈ కోవకు చెందిన వారే షాద్‌నగర్ పట్టణానికి చెందిన డీవీవీఎస్ నారాయణ (దీక్షితుల వీర వేంకట సత్యనారాయణ). ప్రముఖ కవి, రచయిత, గాయకుడు, వ్యాఖ్యాతగా తనదైన శైలిలో పలువురిని అలరిస్తూనే ఉపాధ్యాయుడిగా కొనసాగి ప్రస్తుతం ఎంతో మంది ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు తాను స్వయంగా రచించిన స్టడీ మెటీరియల్స్‌ను దాతల సహకారంతో ఉచితంగా అందిస్తూ సామాజిక సేవా కార్యక్రమాల్లో కూడా తనదైన ముద్ర వేసుకుంటున్నారు డీవీవీఎస్ నారాయణ. ఇప్పటి వరకు తెలుగు రాష్ట్రాల్లోని పలు పట్టణాల్లో 1074 వేదికల ద్వారా పలు రకాల ప్రదర్శనలిచ్చి పలువురు ప్రముఖులచే శభాష్ అనిపించుకున్నారు.

తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రికి చెందిన స్వర్గీయ సూర్యప్రకాశ శాస్త్రి, రుక్మిణి దంపతుల కుమారుడైన నారాయణ బీ.కాం, బీ.ఏ, ఎం.ఏ బీఎడ్ పూర్తి చేసి 1979లో పాలమూరు జిల్లాకు తరలి వచ్చి షాద్‌నగర్, పెబ్బేర్, వనపర్తి, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో పలు ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో ఆంగ్లోపన్యాసకునిగా పనిచేశారు. చిన్నతనం నుంచి పాటలంటే ఎంతో మక్కువ గల నారాయణ పలు వేదికలపై ఘంటసాల, ఎస్పీ బాలసుబ్రమణ్యం పాడిన పాటలు పాడి అలరించారు. అలాగే రచనలు చేయడమంటే ఎంతో ఇష్టమైన నారాయణ యండమూరి వీరేంద్రనాథ్‌ను స్ఫూర్తిగా తీసుకుని నేటివరకు పలు కథనాలు, కవితలు, నవలలు, వ్యాసాలు, సినీ గీతాల సంకలనాలు, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల విద్యార్థుల కోసం పలు సబ్జెక్టులకు సంబంధించి స్టడీ మెటీరియల్స్‌ను స్వయంగా రచించారు. నారాయణ రాసిన కవితలు, వ్యాసాలు ఆంధ్రజ్యోతి, బాలజ్యోతి, ఆంధ్రభూమి, నవ్య, బాలమిత్ర తదితర పుస్తకాల్లో ప్రచురితమయ్యాయి. తాను మొట్టమొదటగా రచించిన స..రి..గ..మ...కథ 1987లో ఆంధ్రజ్యోతి వీక్లీలో ప్రచురితం కావడం విశేషం. అంతే కాకుండా పిల్లల కథలు, తెలుగు-ఆంగ్ల వ్యాకరణాలు, పోటీ పరీక్షల పుస్తకాలను రచించిన నారాయణ పట్టణానికి చెందిన ప్రముఖులు బండారి రమేష్, పాతూరి వెంకట్రావు, చెంది మహేందర్‌రెడ్డిలతో పాటు అమెరికాలో ఉండే తన స్నేహితులైన తిలక్‌ల ఆర్థిక సహకారంతో విద్యార్థులకు ఉచితంగా అందించారు. రాష్ట్ర వ్యాప్తంగా 8 లక్షల పుస్తకాలను పేద విద్యార్థులకు అందించాలన్న సంకల్పంతో ముందుకు సాగుతున్నారు. అంతే కాకుండా ఆలిండియా రేడియో, సప్తగిరి టీవీ, హెచ్‌ఎం టీవీ, మహా టీవీ ఛానళ్లలో నారాయణ సంభాషణలు, కథానికలు ప్రసారమయ్యాయి.



ప్రముఖ సినీ గాయని
ఎస్ జానకితో నారాయణ (ఫైల్)



తాను రచించిన స్నేహమేరా జీవితం పుస్తకావిష్కరణలో (ఫైల్)

అవార్డులు- సత్కారాలు...

సకల కళల్లో ఆరితేరిన నారాయణ పలు ప్రాంతాల్లో ప్రముఖ కవి డాక్టర్ సి. నారాయణరెడ్డి, ప్రముఖ నటుడు అక్కినేని నాగేశ్వర్ రావు, ప్రముఖ గాయకులైన ఎస్పీ బాలసుబ్రమణ్యం, ఎస్. జానకి, రామకృష్ణ, ఆనంద్, ప్రముఖ వ్యాపారవేత్త డాక్టర్ టి. సుబ్బరామి రెడ్డి, అప్పటి పాలమూరు జిల్లా కలెక్టర్ అనంతరాం, అప్పటి మంత్రి చిన్నారెడ్డి, మాజీ ఎమ్మెల్యే రావుల చంద్రశేఖర్‌రెడ్డితో పాటు పలు స్వచ్ఛంద సంస్థల నుంచి పలు రకాల సన్మానాలు, సత్కారాలు అందుకున్నారు.

కళలను పరిరక్షించడమే ధ్యేయం
డీవీవీఎస్ నారాయణ



నేను నేర్చుకున్న పలు రకాల కళలను పరిరక్షించడంతో పాటు ఉత్సాహవంతులైన యువకులకు తర్ఫీదునివ్వాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నాను. ప్రాచీన కళలు కనుమరుగవుతున్న ప్రస్తుత తరుణంలో వాటి పరిరక్షణ బాధ్యతను ప్రభుత్వం చేపట్టాలి. పేద విద్యార్థుల కోసం నేను పలు రకాల వ్యాకరణం, పోటీ పరీక్షలు, స్టడీ మెటీరియల్స్‌ను రచించాను. వాటిని దాతల ఆర్థిక సహకారంతో రాష్ట్రంలోని పలు పాఠశాలలు, కళాశాలల్లో ఉచితంగా అందిస్తున్నాను.



తాను రచించిన గీతాల సంకలనాన్ని డాక్టర్
సి. నారాయణరెడ్డికి అందిస్తున్న డీవీవీఎస్ (ఫైల్)



ప్రముఖ సినీ గాయకుడు
ఎస్పీ బాలసుబ్రమణ్యంతో ..(ఫైల్)



అప్పటి పాలమూరు జిల్లా కలెక్టర్ అనంతరాం చేతుల
మీదుగా షీల్డ్‌ను అందుకుంటున్న నారాయణ (ఫైల్)

పత్తిపైరుపై వింత పురుగుల దాడి

కాయలను తొలిచేస్తున్న వైనం
బెంబేలెత్తుతున్న రైతులు
పైరును పరిశోధిస్తున్న
వ్యవసాయాధికారులు

కేశంపేట: అసలే వర్షాభావం... ఇప్పటికే ఎండిపోయిన మొక్కజొన్న... చెదురుమదురు జల్లులతో కాస్త ఆశాజనకంగా ఉన్న పత్తిపైరుపై వింత పురుగు దాడి చేస్తుండడంతో రైతన్నలు బెంబేలెత్తుతున్నారు. ఎప్పుడూ చూడని పురుగులు కాయలను తొలిచి మొత్తం తినేస్తుందని ఆవేదనకు లోనవుతున్నారు. ఈ సారి కూడా నష్టాలు చవిచూడాల్సి వస్తుందేమోనని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కేశంపేట మండలంలో వాణిజ్య పంటగా 18,798 ఎకరాల్లో పత్తిని సాగుచేశారు. అయితే పత్తి పైరుపై వింత పురుగులు దాడిచేసి కాయలను తొలిచివేస్తున్నాయి. ఒక్కరోజులోనే కాయను మొత్తం తినేసి నాశనం చేస్తున్నాయి. కాయలపై గుంపులుగా చేరి కాయను తొలిచి లోనికివెళ్లి మొత్తం గుజ్జును తినేస్తున్నాయి. అంతేకాకుండా పూత, గూడపై కూడా వీటి ప్రభావం పడుతుంది. ఉదయం, సాయంత్రం సమయాల్లో పైర్లపై వింత పురుగుల ఉధృతి ఎక్కువగా ఉంటున్నది. పురుగులకు రెక్కలు ఉండడంతో రైతులు చేనులోకి వెళ్లే సమయంలో ఎగిరిపోతున్నాయి. ఎవరూ లేని సమయంలో తిరిగి కాయలపై వాలి తినేస్తున్నాయి. పురుగుల ఉధృతిని నివారించకపోతే మరిన్ని పైర్లపై దాడిచేసే అవకాశం ఉంది. కేశంపేట మండల వ్యవసాయాధికారి క్షేత్రస్థాయిలో పత్తి పైర్లను పరిశీలిస్తున్నారు. పత్తి పైర్లకు ఆశించిన వింత పురుగులను సేకరించి ల్యాబ్‌కు పంపిస్తున్నట్లు వారు వివరించారు. తక్షణమే వాటి నివారణ కోసం క్లోరోపైరిపాస్ 50ఈసీ 400 మి.లీ, డైక్లోరోపాస్ 200మి.లీ ఎకరాకు పైపాటిగా పిచికారీ చేయాలని అధికారులు సూచిస్తున్నారు. వింతపురుగులపై పూర్తి సమాచారం వచ్చిన తర్వాత నివారణ చర్యల గురించి వివరిస్తామని వ్యవసాయాధికారులు తెలుపుతున్నారు.



పైరును పరిశీలిస్తున్న రైతులు



కాయను తొలిచి తింటున్న పురుగులు



కాయను తొలుస్తున్న
వింత పురుగులు

కాయలను నాశనం చేస్తున్నాయి
బిక్కి, బాల్యాతండా



పత్తిపైర్లలో వింత పురుగులు తిరుగుతున్నాయి. అవి కాయలపై వాలి తినేస్తున్నాయి. కాయల లోపలికి వెళ్లి గుజ్జును కూడా తింటున్నాయి. కౌలుకు తీసుకొని పత్తిపైరు పండిస్తున్నా కనీసం కౌలు చెల్లించే డబ్బులు కూడా వచ్చేలా లేవు. అధికారులు మందులను ఇవ్వాలి.

పురుగులు విజృంభిస్తే పంట నాశనమే
శేఖర్‌రెడ్డి, రైతు, తొమ్మిదిరేకుల



వింత పురుగులు పత్తిపైరుపై ఆశించి నష్టం చేస్తున్నాయి. మా గ్రామానికి చెందిన ఠాగూర్ నాయక్ పత్తిపైరులో ఈ వింత పురుగులు విజృంభిస్తున్నాయి. అవి ఇతరుల పైర్లపై ఆశిస్తే నష్టం జరుగుతుంది. వ్యవసాయ అధికారులు వింత పురుగుల నివారణకు సరైన సూచనలు, సలహాలు అందించాలి.

సస్యరక్షణతో పురుగుల నివారణ
గోపాల్‌నాయక్, ఏవో, కేశంపేట



తొమ్మిదిరేకుల, లింగంధన గ్రామాల్లో వింత రెక్కల పురుగులు పత్తి చేలపై ఆశిస్తున్నట్లు గుర్తించాం. అయితే రైతులు వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. పైర్లపై క్లోరోపైరిపాస్ 50ఈసీ 400 మి.లీ, డైక్లోరోపాస్ 200మి.లీ ఎకరాకు పైపాటిగా పిచికారీ చేయాలి.

'బల్గేరియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ-2017'విజేత?

1. 2017కి గాను 'మాలతి చందూర్' సాహిత్య పురస్కారానికి ఎంపికైనది?
ఎ) రంగనాయకమ్మ బి) కనపర్తి వరలక్ష్మి
సి) శివరాజు సుబ్బలక్ష్మి
డి) యద్దనపూడి సులోచనరాణి

2. కమ్యూనికేషన్ రంగంలో విశిష్ఠ సేవలందించినందుకు 'మార్కోని సొసైటీ జీవన సాఫల్య పురస్కారం-2017'కి ఎంపికైన ఇండో అమెరికన్?
ఎ) థామస్ కైలత్ బి) శంకర్ సుబ్రమణ్యం
సి) వెంకట్రామన్ రామకృష్ణన్
డి) పురుషోత్తందాస్ మహర్

3. ఎకనమిక్స్ ఇంటెలిజెన్స్ యూనిట్ 140 దేశాలపై నిర్వహించిన సర్వేలో 2017కిగాను అత్యంత నివాసయోగ్య నగరంగా తొలిస్థానంలో నిలిచింది?
ఎ) వాంకోవర్(కెనడా) బి) గ్జిమాసున్(చైనా)
సి) వియన్నా(ఆస్ట్రియా) డి) మెల్‌బోర్న్(ఆస్ట్రేలియా)

4. షాంఘై ర్యాంకింగ్ కన్సల్టెన్సీ 2017కిగాను ప్రకటించిన 'అకడమిక్ ర్యాంకింగ్స్ ఆఫ్ వరల్డ్ యూనివర్సిటీ' నివేదికలో తొలిస్థానం పొందింది?
ఎ) హార్వర్డ్ యూనివర్సిటీ(అమెరికా)
బి) సింగువా యూనివర్సిటీ(చైనా)
సి) మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (అమెరికా)
డి) టోక్యో యూనివర్సిటీ(జపాన్)

5. 2017 ఆగస్టు 17న రక్షణ శాఖ రూ.4168 కోట్లతో ఆరు అపాచీ హెలికాప్టర్ల కొనుగోలుకు ఆమోదం తెలిపింది. వీటి తయారీ సంస్థ బోయింగ్ ఏ దేశానికి చెందింది?
ఎ) ఇటలీ బి) జర్మనీ సి) అమెరికా డి) ఫ్రాన్స్

6. 'బల్గేరియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ-2017' పురుషుల సింగల్స్ విజేత?
ఎ) పీటర్ గ్రేడ్(డెన్మార్క్) బి) లక్ష్యసేన్(ఇండియా)
సి) లిన్‌డాన్(చైనా)
డి) జ్వొనిమిర్ డుర్కిన్‌జాక్(క్రొయేషియా)

7. ఫోర్బ్స్ పత్రిక-2017కిగాను ప్రకటించిన అత్యధిక రెమ్యూనరేషన్ పొందుతున్న హీరోయిన్ల జాబితాలో తొలిస్థానం పొందింది?
ఎ) జెన్నిఫర్ లోపెజ్ బి) జెన్నిఫర్ అనిస్టోన్
సి) అలిసియ వికెందర్ డి) ఎమ్మాస్టోన్

8. ఇండియాటుడే ఇటీవల భారత ప్రధానుల సమర్థతపై 'మూడ్ ఆఫ్ ద నేషన్' పేరిట నిర్వహించిన సర్వేలో 33 శాతం ఓట్లతో అత్యంత సమర్థుడైన ప్రధానిగా నిలిచింది?
ఎ) అటల్ బిహారి వాజ్‌పేయి
బి) జవహర్‌లాల్ నెహ్రూ
సి) ఇందిరాగాంధీ డి) నరేంద్రమోదీ

9. మదర్సాల ఆన్‌లైన్ నమోదుకు ఇటీవల ప్రత్యేక పోర్టల్‌ను ప్రారంభించిన రాష్ట్రం?
ఎ) గుజరాత్ బి) ఉత్తరప్రదేశ్
సి) బిహార్ డి) కేరళ

10. ఇన్ఫోసిస్ ఎం.డి. విశాల్‌సిక్కా రాజీనామాతో తాత్కాలిక ఎం.డి.గా ఎవరు నియమితులయ్యారు?
ఎ) ప్రవీణ్‌రావు బి) సంజయ్ బంగా
సి) సబీర్ భాటియా
డి) విజయ్ శేఖర్ శర్మ



ఎస్.మహిపాల్‌రెడ్డి
సీనియర్ ఫ్యాకల్టీ

11. తెలంగాణలో తొలి స్మార్ట్ పోలీస్‌స్టేషన్‌ను 2017 ఆగస్టు 18న ఎక్కడ ప్రారంభించారు?
ఎ) జమ్మికుంట(కరీంనగర్) బి) బెజ్జంకి(సిద్ధిపేట)
సి) నవిపేట(నిజామాబాద్)
డి) దోమకొండ(నిజామాబాద్)

12. 2017 ఆగస్టు 19న మహిళ భద్రత కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించిన టోల్‌ఫ్రీ నంబరు?
ఎ) 181 బి) 1551 సి) 112 డి) 999

జి.కె. అండ్ కరెంట్ అఫైర్స్

13. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఫుడ్ అండ్ అగ్రికల్చర్ అందించే 'వ్యవసాయ నాయకత్వ అవార్డు-2017'కి ఎంపికైనది?
ఎ) శివరాజ్‌సింగ్ చౌహాన్(మధ్యప్రదేశ్)
బి) నితిష్ కుమార్(బీహార్)
సి) కె.చంద్రశేఖర్‌రావు(తెలంగాణ)
డి) విజయన్(కేరళ)

14. 2017కి గాను ఫోర్బ్స్ పత్రిక ప్రకటించిన అత్యధిక ఆదాయం గల మహిళ క్రీడాకారుల జాబితాలో తొలిస్థానం పొందింది?
ఎ) సెరెనా విలియమ్స్(టెన్నిస్)
బి) మరియ మజుచిక్(చెస్)
సి) పి.వి.సింధు(బ్యాడ్మింటన్)
డి) స్మృతి మందన(క్రికెట్)

15. 'ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్- 2017'కి ఆతిథ్యమిస్తున్న నగరం?
ఎ) కౌలాలంపూర్(మలేషియా)
బి) గ్లాస్గో(బ్రిటన్) సి) బ్యాంకాక్(థాయ్‌లాండ్)
డి) హంగ్జే(చైనా)

16. ఎవరి జయంతిని పురస్కరించుకొని ఆగస్టు 20ని 'సద్భావన దివస్'గా నిర్వహిస్తారు?
ఎ) రవీంద్రనాథ్ ఠాగూర్ బి) రాజీవ్‌గాంధీ
సి) ఇందిరాగాంధీ డి) పండిట్ రవిశంకర్

17. భారత నౌకా దళానికి చెందిన ఆరుగురు మహిళ అధికారులు ప్రపంచ యాత్ర లక్ష్యంగా చేపట్టిన 'నావికా సాగర్ పరిక్రమ' ప్రాజెక్టులో ఉపయోగిస్తున్న నౌక?
ఎ) ఐఎన్‌ఎస్‌వి తరిణి
బి) ఐఎన్‌ఎస్‌వి మహదేవి
సి) ఐఎన్‌ఎస్‌వి సింధురక్షక్
డి) ఐఎన్‌ఎస్‌వి తలాష్

18. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నూతనంగా విడుదల చేయనున్న రూ.50 నోటుపై ఉన్న చిహ్నం 'సాంస్కృతిక రథాన్ని' ఎక్కడి నుంచి గ్రహించారు?
ఎ) జైపూర్(రాజస్థాన్) బి) హింపి(కర్ణాటక)
సి) శ్రావణబెళగొళ(కర్ణాటక) డి) పింప్రి(మహారాష్ట్ర)

19. 'నికోలాయ్ కుద్‌షెవ్' ఇటీవల ఏ దేశం తరపున భారత్‌లో రాయబారిగా నియమితులయ్యారు?
ఎ) రష్యా బి) మంగోలియా
సి) కజకిస్థాన్ డి) ఇజ్రాయెల్

20. భారత్‌లో పాకిస్థాన్ నూతన హైకమిషనర్‌గా ఇటీవల ఎవరు నియమితులయ్యారు?
ఎ) అబ్దుల్ బాసిత్ బి) మలీహాలోధి
సి) సొహెల్ మహమ్మద్ డి) రియాల్ షరీఫ్

21. పి.ఆర్.శేషాద్రి ఇటీవల ఏ బ్యాంక్‌కు మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు?
ఎ) కెనరా బ్యాంక్ బి) లక్ష్మివిలాస్ బ్యాంక్
సి) బ్యాంక్ ఆఫ్ బరోడా డి) కరూర్ వైశ్యా బ్యాంక్

22. 2017కిగాను 'స్పానిష్ సూపర్ కప్' ఫుట్‌బాల్ టోర్నీ విజేత?
ఎ) రియల్ మాడ్రిడ్ క్లబ్ బి) బార్సిలోనా క్లబ్
సి) ఇంగ్లీష్ ప్రీమియర్ క్లబ్ డి) రివర్స్ ప్లెటో క్లబ్

23. 2017 ఆగస్టులో ప్రపంచ ఆరోగ్య సంస్థ ఏ దేశాన్ని 'పోలియో రహిత దేశం'గా ప్రకటించింది?
ఎ) సెనెగల్ బి) కాంగో
సి) సోమాలియా డి) పాకిస్థాన్

24. 'అండర్-19 ప్రపంచ కప్ క్రికెట్ టోర్నీ-2018'కి ఆతిథ్యం ఇస్తున్న దేశం?
ఎ) ఆస్ట్రేలియా బి) న్యూజిలాండ్
సి) ఇండియా డి) శ్రీలంక

25. భారత వ్యవసాయ శాఖ 2016-17కి గాను విడుదల చేసిన గణాంకాల ప్రకారం దేశంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి(మిలియన్ టన్నుల్లో)
ఎ) 110.15 బి) 384.76 సి) 314.16 డి) 275.68

26. భారత్ ఏ దేశంతో కుదుర్చుకొన్న మేథోహక్కుల పరస్పర అవగాహన ఒప్పందాన్ని కేంద్ర కేబినెట్ ఇటీవల ఆమోదించింది?
ఎ) ఆస్ట్రియా బి) స్వీడన్ సి) ఫ్రాన్స్ డి) అమెరికా

27. హిందుస్థాన్ కాపర్ లిమిటెడ్ నూతన చీఫ్ మేనేజింగ్ డైరెక్టర్?
ఎ) సంతోష్‌శర్మ బి) మన్నెల్లి లక్ష్మీకాంతం
సి) సంజయ్‌గుప్తా డి) హర్షకుమార్ భన్వాల్

28. ఇటీవల విడుదలైన 'ఇండియా ఎట్ 70; స్నాప్ షాట్ సిన్స్ ఇండిపెండెన్స్' పుస్తక రచయిత?
ఎ) ఎన్.సి.ఉల్లేఖ్ బి) రోషెన్ దలాల్
సి) అమృతా వర్గీస్ డి) అరుంధతిరాయ్

29. మహారాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన 'నమో యువ రోజ్‌గార్ కేంద్ర' ప్రధాన ఉద్దేశం?
ఎ) యువ పారిశ్రామికవేత్తలకు రుణసౌకర్యం
బి) ఆర్గానిక్ కూరగాయలను తక్కువ ధరకు ప్రజలకు చేరువ చేయడం
సి) యువజన సంఘాల ఏర్పాటు ద్వారా ఐక్యత పెంపొందించడం
